ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
6 మార్చి, 2011

ENTERED



పరీక్షలు.. పాఠాలు...

హ్యాపీ బర్త్‌డే

(2011 మార్చి 6 నుంచి 2011 మార్చి 12 వరకు)

కె. సంధ్య శ్రీ
మార్చి 9
అనురాధ-గంగాధర్ రెడ్డి
మద్దిలపాలెం-విశాఖపట్నం

పి. యశ్వంత్ తేజ్
మార్చి-8
అరుణకుమారి-చినకొండయ్య
కొనకనమిట్ల-ప్రకాశం

శ్రీ వర్ష
మార్చి 6
కల్పన-అనంత్
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

తితిక్ష
మార్చి
శిరీష-మన్యం రాములు
హైదరాబాద్

ఎన్. కావ్య
మార్చి
కృష్ణవేణి-వెంకటేష్
చిట్యాల-మహబూబ్‌నగర్

కె. లలితకృష్ణ
మార్చి 8
వైదేహి-శ్రీనివాసరావు

బి. లక్ష్మీప్రసన్న
మార్చి 7
శ్రీలత-ప్రభాకర్
బిజ్జాలవారితోట-ఖమ్మం

సాయి సుప్రియ
మార్చి
శేషారత్న కుమారి-మురళీకృష్ణ
వారవాసరం-ప.గో. జిల్లా

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కలర్ ఫొటో జతచేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి, ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

మనలో మాట

అమెరికా అంగట్లో అవయవాలు

తల్లిదండ్రులు ఎవరైనా రెక్కలు ముక్కలు చేసుకొని పిల్లలను పోషిస్తారు, చదివిస్తారు. కాయకష్టం చేసి కలోగంజో తాగైనా బిడ్డల భవిష్యత్తును నిర్మిస్తారు. ప్రజా సంక్షేమం అనే బాధ్యతను ప్రభుత్వాలు వదిలేసుకుంటే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

తనకు తానే అగ్రరాజ్యంగా అభివర్ణించుకొని, ప్రపంచ దేశాలన్నిటికీ మార్గదర్శినని చెప్పుకునే అమెరికాలో ఒక జంట తమ శరీర భాగాలను అమ్ముకోవాలని చూస్తున్నారు. పిల్లల చదువుకోసం చేసిన రెండు లక్షల డాలర్ల అప్పును తీర్చటానికి తమకు ఇంతకుమించిన మార్గం లేదని అక్షరాలా ప్రకటన ఇచ్చారు.

తాము సాధించిన ప్రగతి ఇంతా అంతా కాదని నిన్నమొన్నటిదాకా ఢంకా భజాయించిన అమెరికాలో నేడు నెలకొన్న దుస్థితికి ఇదొక మచ్చుతునక. వివిధ రంగాల్లో అమెరికా డొల్లతనమేమిటో గత ఏడాదిగా సర్వ ప్రపంచానికి తేటతెల్లమవుతూనే ఉంది. అంకుల్ శ్యామ్ ఇంట్లో ఈగలమోతకు ఈ దంపతుల ప్రకటన పరాకాష్ట.

అమెరికా అడుగుజాడే గొడుగు నీడగా భావించే మన పాలకుల తీరు కూడా ఇందుకు భిన్నంగా లేదు. విద్య, వైద్యం ప్రైవేటుపరమైతే ఆ భారం తట్టుకోవడం కష్టమని జనం ఏళ్ల తరబడి వ్యతిరేకించారు. అయినా, తలకెక్కించుకోలేదు. ఈరోజు పిల్లల చదువుకు ఫీజులు చెల్లించటానికి జనం గిజగిజలాడి పోవాల్సి వస్తోంది. ఇతర అవసరాలు ఎండగట్టుకునైనా ఫీజులూ డొనేషన్లకోసం వేలూ లక్షలూ కూడేయాల్సి వస్తోంది. అడ్డూఅదుపూ లేని విద్యావ్యాపారం అంతకంతకూ పరాక్రమిస్తూనే ఉంది. ఇలాంటి పరిస్థితిలో ఫీజు రీయింబర్స్‌మెంటు ఇచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వం రకరకాల సాకులతో విద్యార్థుల భవితవ్యంతో ఆటలాడుతోంది.

అమెరికా- పౌరులు శరీర అవయవాలు అమ్ముకోవటానికి ప్రకటనలిచ్చేంత 'స్వేచ్ఛాదేశం' కాబట్టి, అక్కడ ప్రకటనలు ఇచ్చుకోగలుగుతున్నారు. ఇక్కడ అలాంటి అధికారిక 'అవకాశం' లేదు. కానీ, బతకటం కోసం రక్తమూ, కిడ్నీలూ అమ్ముకుంటున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు.

అలాంటి దుస్థితి మనకు వద్దు. అమెరికా లాంటి భూతాల స్వర్గం మనకొద్దు. అంకుల్ శ్యామ్ అడుగుజాడల్లో నడిస్తే, ఆ సుభాషితాలు తలకెక్కించుకుంటే- పతనం తప్ప మరో దారి లేదని అర్థమైపోయింది. ఏలికలు ఆ దారి పట్టకుండా నిలేయాల్సిన బాధ్యత నిస్సందేహంగా జనానిదే!

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
ఈ పేజ్	...	4
కవిత్వమ్	...	6
రుచి	...	7
నవ్వుల్ పువ్వుల్	...	10
కొత్త పుస్తకాలు	...	11
చూద్దామా	...	12
నడుస్తున్న చరిత్ర		
మోడర్న్ టైమ్స్	...	13
అట్టమీది కథ	...	14
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ... 8

బాపురే రమణీయం... మానవీయం...

కథ ... 18

ఐదు పాలిచ్చే జంతువులు

వికాసం ... 20

పొగడ్తలు... విమర్శలు...



స్ఫూర్తినిచ్చే పోరాటం

హిమాంశురాయ్ చరిత్ర చదివే వరకు తెలుగు టాకీ గురించి తెలుసు కానీ మూకీల సంగతి తెలియదు. సినిమా కబుర్ల ద్వారా రెంటాల వారు చాలా విషయాలు తెలియజేస్తున్నారు. ఈజిప్టు పోరాటాల గురించి కోటేశ్వరరావుగారు చాలా వివరాలు అందించారు. ప్రధానంగా యువత ప్రభావితమై ఈ పోరాటాన్ని నడిపించిన తీరు మరింత ఆకట్టుకొంది. అలా బాధపడే అన్ని దేశాలవారికీ ఈ పోరాటం స్ఫూర్తి కలిగించాలి.

సూర్యనారాయణ,
భీమనవారిపేట.

కొంగొత్త సమాచారం

వళిగళం గోపీ, అవనిగడ్డ వనజ అందించిన 'కురుల నుండి సిరులు' వ్యాసం కొంగొత్త సమాచారాన్ని అందించింది. నిద్రన్నదే రాని థాయ్‌గాక్ ఉదంతం అచ్చెరువొందేలా చేసిన 'తెల్సా' శీర్షిక చిత్రమైన విషయాలతో ఆకట్టుకుంది. పెన్సిల్ ఆర్ట్ అద్భుతాల చిత్రావళి సృజనాత్మకతకు అద్దం పట్టింది. 'వికాసం' బడ్జెట్ ప్లానుకున్న ప్రాధాన్యతను తెలియజేసింది. అనేక రకాల భావపరంపరల తోరణంలా 'కవిత్వం' పేజీల్లోని భావవిపంచికలు హృద్యంగా ఉన్నాయి. 'సినిమా కబుర్లు'లో సుసర్ల దక్షిణామూర్తిగారి గురించి చాలా వివరాలు తెలుసుకున్నాం. నీరు పల్లం నుండి ఎత్తుకు ప్రవహించే టెక్నాలజీ ఉన్న ఆంగ్‌కోర్ వాట్ దేవాలయం విశేషాలను చదివాక ఆశ్చర్యమనిపించింది. నకిలీ పెన్‌డ్రైవ్‌ల నుండి కంప్యూటర్‌ను ఎలా కాపాడుకోవాలో ఈ పేజీ ద్వారా తెలిసింది. 'మనలోమాట' వాస్తవంగా వుంది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం.

అమ్మ భాష బాగుంది

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రచురించిన 'అమ్మ భాష అమృతం' వ్యాసం బాగుంది. సొంత భాషను వదిలేసి పరాయి భాషకోసం పాకులాడే వాళ్లు పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకను చూసైనా మన మాతృభాషను తప్పుల్లేకుండా మాట్లాడడం, రాయడం చేస్తే బాగుంటుందేమో! ప్రసార మాధ్యమాల్లో వాడే భాష మాతృ భాషను వక్రీకరిస్తున్నట్లుగా, అవమానపరుస్తున్నట్లుగా ఉంది. మన భాషను రక్షించుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

స్నేహమయి...

ఈ వారం సినిమా పేజీలో సుసర్ల దక్షిణామూర్తిగారి గురించి చాలా విషయాలు తెలియజేశారు. అయితే బాలమురళీ కృష్ణతో.. అని ఉన్న ఫొటోలో ఉన్నది బాల మురళీకృష్ణగారు కాదు. వారు ఆనాటి మన తెలుగు హీరో సిహెచ్.నారాయణరావుగారు. 'చూద్దామా'లోని కంపూచియాలోని దేవాలయం గురించి, నాటి పూర్వ చరిత్ర గురించి తెలుసుకోగలిగాం. స్నేహ నిజంగా స్నేహమయిగా ఉంటోంది.

పి. బాలకృష్ణారావు, గాజువాక.

చాలా విషయాలు తెలిశాయి

సినిమా కబుర్లు శీర్షికలో రెంటాల జూనియర్ ప్రఖ్యాత సంగీత దర్శకులు సుసర్ల దక్షిణామూర్తిని గురించి మాకు తెలీని ఎన్నో విషయాలు తెలియజేసినందుకు ధన్యవాదాలు. దక్షిణామూర్తిగారు కొత్త గాయనీ గాయకులను పరిచయం చేసే క్రమంలో వసంత కుమారిని 1959లో పరిచయం చేశారన్నారు. అయితే ఆమె



1957లో 'భలే అమ్మాయిలు'లో పి.లీలగారితో కలిసి ఒక పాట పాడారు.

ఘంటా నాగేశ్వర ప్రసాద్,
పెదకాకాని.

భక్తులపై భారమా!

కురుల నుండి సిరులు అనే వ్యాసం వల్ల కురులకున్న ఉపయోగం తెలుసుకోగలిగాం. వెంట్రుకలకు విలువివ్వకుండా మాట్లాడేవారు ఈ వ్యాసం చదివితే ఇక నుండి ఆ భావాన్ని వదులుకుంటారు. తల నీలాలు ఇవ్వడానికి వచ్చే భక్తులపై ఛార్జీల భారం వేయకపోతే బాగుండనిపించింది.

ఇలిపిల్లి, భీమనవారిపేట.

అరుదైన ఆలయాలు

కంపూచియాలోని హిందూ దేవాలయాల విశేషాలు అలరించాయి. విదేశాల్లో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలతో వెలుగొందుతున్న దేవాలయాలు అరుదు. అలాంటి వాటిలో ఇది ప్రముఖమైనదని, మన కాంభోజ రాజ్యమే కంపూచియాగా మారిందని తెల్సుకున్నాం. చదవవలసిన వ్యాసం అనిపించింది.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.

★

బుల్లి అక్వేరియం

నీళ్ల పోసిన అద్దాల పెట్టెలో రంగురంగుల చేపలు తిరగాడుతుంటే కళ్లు తిప్పుకోలేం. ఇప్పుడు మీ ముందున్నది కూడా అక్వేరియమే. కాకపోతే అత్యంత బుల్లిది. ఇందులో కేవలం రెండంటే రెండు చెంచాల నీళ్లు పోస్తే చాలు. నిండిపోతుంది. మరి ఇంక ఇందులో చేపలేం తిరగాడతాయి! అని ఆశ్చర్యపోమాకండి. ఆ మధ్య అట్లాంటిక్ మహాసముద్రంలో కనిపించిన బుల్లి చేప గురించి విన్నాం కదా. అలాంటివాటికి ఈ అక్వేరియం సరిగ్గా సరిపోతుంది. ఇంతకీ ఈ చిరు ఉపాయం ఎవరికొచ్చింది చెప్మా! అంటే.. అనటొలీ కొనెంకో అనే రష్యా పౌరుడికి తట్టింది. ఆయన గత 30 ఏళ్లగా ఇలాంటి బుల్లి బుల్లి అద్భుతాలే చేస్తూ చూపరులను ఆశ్చర్యపరుస్తున్నాడు. బియ్యపు గింజలు, మిరియాలు...ఆఖరుకు వెంట్రుకల మీద కూడా కళాఖండాలు సృష్టించడంలో దిట్ట అనటొలీ.



నఖ సుందరి

కొందరికి కేశాలు, కొందరికి నఖాలు పేరుప్రఖ్యాతలు, గుర్తింపు తెచ్చిపెడుతుంటాయి. ఆ కోవకు చెందినదే ఈ నఖ సుందరి. చూశారుగా! ఎంత పొడవు గోళ్లో. ఆ పొడవాటి గోళ్ల వల్లే ఆమెను జనాలు విచిత్రంగా చూస్తుంటారు. వింతగా చెవులు కొరుక్కుంటారు వాటిని చూచి. ఇంతకీ వాటిని ఆమె ఎంతకాలంగా పెంచుతుందనుకుంటున్నారు? 22 ఏళ్లగా. వాటి పొడవెంతనుకుంటున్నారు? 24 అంగుళాలు. ఇంక వాటికోసం ఆమె ఎంత సమయం, డబ్బు వెచ్చిస్తుందనుకుంటున్నారు? నెలకు 5 గంటలు, 250 డాలర్లు ఖర్చు చేస్తుంది. వాటిని కంటిపాపల్లా కాపాడుకుంటుంది. ప్రతి నెలా తప్పనిసరిగా బ్యూటీపార్లర్‌కు వెళుతుంది. అదో కాలక్షేపం లెండి!

తెలుసా!

కేశాలు లేకపోతేనే... కిరీటం దక్కనే

అందాలపోటీలు ఏ రేంజ్‌లో వుంటాయో అందరికీ తెలిసిన విషయమే. నఖశిఖ పర్యంతం పరీక్షించాకే ఎవరు అందరిలోకి అందగత్తో ప్రకటిస్తుంటారు. అలాంటిది నెత్తిమీద జుట్టు లేకుండానే అందాల కిరీటం కొట్టేస్తే...! అదే జరిగింది అమెరికాలో! కయ్లా మార్టెల్ గత కొద్ది సంవత్సరాలుగా మిస్ డెల్వారె అందాల పోటీలో పాల్గొంటోంది. నిరాశగా తిరిగొస్తోంది. కారణం! ఆమెకు గుండు. వెంట్రుకలు లేకుండా అందాలరాణి కిరీటం దక్కించుకోవడం ఎంత కష్టం. అయితే ఆమె వాస్తవ గాథ తెలుసుకున్న న్యాయనిర్ణేతలు చివరికి తనకే కిరీటాన్ని కట్టబెట్టారు. కథలోకెళితే... కయ్లాకు ఓరకమైన అనారోగ్యం వుంది. దాంతో తన పదో ఏట నుంచే వెంట్రుకలు రాలిపోసాగాయి. చివరకు అది పూర్తిగా గుండులా తయారైంది. కానీ ఆమెకేమో అందాలపోటీల్లో పాల్గొనాలని, కిరీటం గెలవాలని ఆశ. అందుకే పాల్గొనేది. చివరికి జరిగినది తెలుసుగా. అంతేకాదండోయ్. మిస్ అమెరికా పోటీలకు కూడా అర్హత సంపాదించింది గుండు సుందరి.

సరేగానీ మీకో అనుమానం పీడిస్తుండాలే! అదేనండీ గుండుతో అందాల పోటీల్లో ఎలా పాల్గొంటోంది అని. అప్పుడు విగ్గు పెట్టుకుని మేనేజ్ చేస్తుంది. బొమ్మలో కయ్లా దువ్వుతోంది తన విగ్గునే.

తొలి మహిళా ప్రోగ్రామర్ అడా

అమె జీవితం
సప్తవర్ణ సమ్మేళనం. ఓ నవల
చదువుతున్న అనుభూతి. ప్రేమ, అందం, ఆనందం,
ఐశ్వర్యం, విజ్ఞానం, విలాసం, వ్యసనం, అనారోగ్యం, విషాదం.... ఆమె జీవితంలోని పలు కోణాలను ఆవిష్కరిస్తుంది. 36 ఏళ్ళకే నూరేళ్ళు నిండిన ఓ అసాధారణ ప్రతిభాశాలి. అందం, తెలివితేటలతోపాటు తొలి పరిచయంతోనే ఎదుటివారిని ఆకట్టుకోగల ఆకర్షణ శక్తి, ఎంత క్లిష్టమైన సమస్యనైనా క్షణాల్లో అర్థం చేసుకొని, విశ్లేషించగల సూక్ష్మబుద్ధితోపాటు సంగీతం, ఆటలలో మంచి ప్రావీణ్యం ఆమె సొంతం. గణితశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి, పలు జటిలమైన సమస్యలను పరిష్కరించడానికి కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను రాసే స్థాయికి ఎదగడమే కాకుండా సంగీతం సమకూర్చడానికి కంప్యూటర్లను వినియోగించవచ్చని, వాటిని వాటంతటవే ప్రోగ్రామ్ చేసుకోగల తెలివైన ఎలక్ట్రానిక్ పరికరాలుగా రూపొందించవచ్చని 150 సంవత్సరాల క్రితమే ప్రతిపాదించిన అసాధారణ మహిళా మణిహారం... ప్రపంచంలోనే తొలి మహిళా ప్రోగ్రామర్ అడా అగస్టా లవ్‌లేస్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అణుమాత్రంగా ఆమె జీవితంలోని కొన్ని ముఖ్యాంశాలు....

లార్డ్ జార్జ్ గార్డన్ నోయెల్ బైరన్, అన్నా ఇసబెల్లె మిల్బ్యాంకె దంపతుల ఏకైక కుమార్తె అడా. తండ్రి బైరన్ కవి. స్వతంత్ర భావాలు, విప్లవాత్మక ఆలోచనలు గల బైరన్ విలాసపురుషుడు. గణితంపై కొంత చులకనభావం గల వ్యక్తి. అడా తల్లి మిల్బ్యాంకె వ్యక్తిత్వం దీనికి పూర్తిగా వ్యతిరేకం. ఆమెకి కవిత్వం అంటే గిట్టదు. గణితశాస్త్రంపై మక్కువ, క్రమశిక్షణకు మారుపేరు. విచిత్రం ఏమిటంటే... విరుద్ధ భావాలు, భిన్న అభిరుచులు, విభిన్న మనస్తత్వాలు గల వీరిద్దరూ ప్రేమించి పెళ్ళి చేసుకోవడం. వీరి వివాహం జరిగిన తొలినాటి నుంచే వారి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి.



చిన్నారి అడా

ఇంగ్లాండ్‌లో 1815 డిసెంబర్ 15న బైరన్, మిల్బ్యాంకె దంపతులకు ఒక కుమార్తె జన్మించింది. ఆమెకు అడా అగస్టా బైరన్ అని పేరుపెట్టారు. కూతురు జన్మించిన కొద్దిరోజులకే బైరన్, మిల్బ్యాంకె మధ్య వివాదం తీవ్రస్థాయికి చేరుకోవడంతో 1816, జనవరి 16న వారు విడాకుల కోసం కోర్టునాశ్రయించారు. అడాను పెంచే బాధ్యత తల్లికే అప్పగిస్తూ కోర్టు వారికి విడాకులు మంజూరు చేసింది.

అడాను చిన్నప్పటినుంచే పలు కట్టుదిట్టాలతో, క్రమశిక్షణగా పెంచింది మిల్బ్యాంకె. తండ్రి ప్రభావం అడాపై పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. అడాను ఒక గొప్ప గణితశాస్త్రవేత్తగా తీర్చిదిద్దాలనేది ఆమె అభిమతం. ఈ ప్రయత్నంలో విపరీతవైఖరిని అవలంభించింది. అతి క్రమశిక్షణ పేరుతో కుమార్తెను మరీ వేదిస్తున్నావని, అలా చేయడం వల్ల చిన్నారి అడా మానసికంగా దెబ్బతింటుందని బంధుమిత్రులు మిల్బ్యాంకె వైఖరి మార్చేందుకు ప్రయత్నించినా ఆమె పట్టించుకోలేదు.

అడాకి చిన్నతనంలో లెక్కల మీదకన్నా భౌగోళికశాస్త్రంపైనే ఆసక్తి ఎక్కువగా వుండేది. అయితే తల్లిని మెప్పించడానికి గణితం చదవక తప్పేది కాదు. అడాపై తన తండ్రి ప్రభావం పడకూడదని ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా... అడాకి కొన్ని తండ్రి పోలికలు వచ్చాయి. కవిత్వంపై మోజు వుండేది. అయితే దీనికి మిల్బ్యాంకె అభ్యంతరం చెప్పడంతో అడా అభ్యర్థనమేరకు సంగీతం నేర్చుకునేందుకు టీచర్‌ను ఏర్పాటు చేసింది. సంగీతంలో అడా మంచి ప్రావీణ్యం సాధించింది. పియానో, వయోలిన్, హార్ప్ వంటి సంగీత వాద్యాలను చక్కగా వాయించేది. సంగీతంతో పాటు ఆటల్లో కూడా బాగా రాణించేది. గుర్రపుస్వారీ అంటే ఆమెకెంతో ఇష్టం. జిమ్నాస్టిక్స్‌లో మంచి నైపుణ్యం ప్రదర్శించేది. అంతేకాకుండా సాంప్రదాయ నృత్యం కూడా నేర్చుకుంది. ఏ విద్య నేర్చుకున్నా విశేష ప్రావీణ్యం కనబరచడం అడా అసాధారణ సామర్థ్యానికి తార్కాణం. తల్లి అతి క్రమశిక్షణ కారణంగా మానసిక వత్తిళ్ళతో తరచూ అనారోగ్యానికి గురవుతుండేది.

1833లో బ్రిటిష్ గణిత శాస్త్రవేత్త చార్లెస్ బాబేజ్‌ని కలవడంతో అడా జీవితం ఒక గొప్ప మలుపు తిరిగింది. సంపన్న కుటుంబాలకు చెందిన మహిళలు సరదాగా కాలం గడిపేందుకు ఏర్పాటు చేసుకున్న 'బ్లూ స్టాకింగ్' అనే మహిళా

సంఘంలో చేరింది అడా. ఈ సంఘం ఏర్పాటు చేసే వైజ్ఞానిక కార్యక్రమాల్లో పలువురు శాస్త్రవేత్తలను కలుసుకొని అనేక విషయాలను తెలుసుకుంటుండేవారు. అటువంటి సందర్భంలోనే చార్లెస్ బాబేజ్‌ను కలిసింది అడా.

కంప్యూటర్ తయారీకి ప్రయత్నాలు జరుగుతున్న సమయం అది. అందులో భాగంగానే బాబేజ్ డిఫరెన్స్ ఇంజన్ అనే యంత్రాన్ని డిజైన్ చేశారు. ఈ యంత్రం ఒక్క అల్గారిథం ఆధారంగానే పనిచేసేది. ఈ లోపాన్ని అధిగమించడానికి బాబేజ్ ఎనలైటికల్ ఇంజన్ అనే మరో యంత్రాన్ని డిజైన్ చేయడం ప్రారంభించాడు. ఈ యంత్రాన్ని అనేకచోట్ల ప్రదర్శించి, దాని గురించి మాట్లాడేవాడు. అటువంటి ప్రదర్శనకు వెళ్ళిన అడాకు బాబేజ్ ప్రసంగం ఆసక్తి కలిగించింది. ఆ యంత్రం గురించి మరిన్ని విషయాలు అడిగి తెలుసుకున్న అడా విశ్లేషణా సామర్థ్యం బాబేజ్‌ను ఆకట్టుకుంటుంది. అనంతరం వీరిద్దరూ మంచి మిత్రులయ్యారు. బాబేజ్ యంత్రం పట్ల ప్రభావితురాలైన అడా ఆ యంత్రాన్ని మరింత అభివృద్ధి చేసి, సమర్థవంతమైన యంత్రంగా తయారుచేయడంలో బాబేజ్‌కు సహకరించేందుకు పూనుకున్నారు. బాబేజ్ డిజైన్‌కు అడా డాక్యుమెంటేషన్ చేసేవారు. బాబేజ్ వివిధ రచనలను, ఎడిట్ చేయడం, తర్జుమా చేయడంతోపాటు ఎనలైటికల్ ఇంజన్‌కి ప్రోగ్రాములు రాస్తుండేవారు. ఈ కారణంగానే అడా తొలి మహిళా కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. 1842లో బాబేజ్ తన డిఫరెన్స్ ఇంజన్‌ని ఇటలీలో ప్రదర్శించారు. దాన్నిచూసి ప్రభావితుడైన ఇటాలియన్ గణితశాస్త్రవేత్త Luigi Mena brea దానిపై ఫ్రెంచ్ భాషలో రాసిన పుస్తకాన్ని అడా ఇంగ్లీషులోకి అనువదించారు. ఆ పుస్తకంలోని వివిధ అంశాలపై మరింత వివరణ ఇస్తూ అడా తన సొంత ఫుట్‌నోట్‌లను జోడించారు. ఇక్కడ ఆసక్తికరమైన

విషయమేమిటంటే అడా రాసిన ఫుట్‌నోట్స్‌లు అసలు పుస్తకం కన్నా రెండురెట్లు అధికంగా వుంది. ఆ వివరణను కూడా ఒక ప్రత్యేక పుస్తకంగా వెలువరించారు. తన 19ఏళ్ళ వయస్సులో అడా లార్డ్ విలియమ్ కింగ్‌ని వివాహం చేసుకున్నారు. వివాహానంతరం అడా ఇంటి పేరు బైరన్ నుంచి లవ్‌లేస్‌గా మారింది. అడా పూర్తిపేరు అడా అగస్టా లవ్‌లేస్ అయ్యింది.

అడా తను రాసిన నోట్సులో ఎనలైటికల్ ఇంజన్‌తో ఎన్నివిధాలై ప్రోగ్రామ్స్ చేయవచ్చో, సాధారణ కంప్యూటర్ చేసే పనులకు మించి, మరెన్ని పనులు చేయవచ్చునో వివరించారు. Bernoullis numbers వంటి క్లిష్టమైన గణిత సమస్యలు సాధించడానికి ప్రోగ్రామ్‌లు రాసారు. ఎనలైటికల్ ఇంజన్ మెమరీ సామర్థ్యాన్ని వివరిస్తూ స్టోర్‌హౌస్ కాలమ్‌లో డేటాని స్టోర్ చేయవచ్చని వివరించారు. అడా ప్రస్తావించిన స్టోర్‌హౌస్ కాలమ్ ఆలోచన ఆధారంగానే నేటి ఆధునిక ప్రోగ్రామింగ్ ప్రక్రియలలో వాడుతున్న మెమరీ లోకేషన్ లేదా అడ్రస్ అనేది ఆచరణలోకి వచ్చింది. అడా అంతటితో ఆగలేదు. అప్పట్లో పంచ్‌డ్ కార్డుల ద్వారా కంప్యూటర్లకి డేటా అందించబడేది. ఇచ్చిన సూచనలను బట్టిఏదైనా కార్డు వరుసక్రమంలో వెనుకకు వెళ్ళి మరోసారి ఫీడ్ అయ్యేలా చేయవచ్చునన్నారు. నేడు అందరికీ తెలిసిన లూపింగ్ ప్రక్రియ కూడా ఇటువంటిదే. ఎనలైటికల్ ఇంజన్ కేవలం సంఖ్యలు మాత్రమేగాకుండా సింబల్స్‌ని కూడా రీడ్ చేసే విధంగా చేయవచ్చన్నారు. దీనిని ఒక నిర్దిష్టమైన విధంగా ప్రోగ్రామింగ్ చేయడం ద్వారా సంగీతం సమకూర్చవచ్చునని, గ్రాఫిక్స్ సృష్టించవచ్చునని సూచించారు. నేడు ప్రోగ్రామర్లకు శ్రమ తగ్గించే బిల్ట్ ఇన్ ఫంక్షన్స్ సౌకర్యాన్ని ఆమె 150 ఏళ్ళ క్రితమే కల్పించారు. ఎంటర్ చేయబడిన డేటా ట్రూ లేదా ఫాల్స్ అనే కండిషన్ ద్వారా నిర్ధారించిన ప్రోగ్రామ్ ఎలా పనిచేయాలో నియంత్రించవచ్చునని చెప్పారు. ప్రోగ్రామ్‌లలో అందరికీ అర్థమయ్యే విధంగా కామెంట్స్ రాసే అలవాటు కూడా అడా నుంచి వచ్చినదే.

అడా జీవితంలోని మరో కోణం అత్యంత దయనీయంగా వుంటుంది. తండ్రి ప్రభావం నుండి దూరం చేయడానికి తన తల్లే అనేక అబద్ధాలు చెప్పడం, బంధువులకు సైతం దూరంగా వుంచడం వంటి విషయాలన్నీ తెలుసుకున్న అడా తన తల్లితో తెగతెంపులు చేసుకున్నారు. చిన్నతనంలో ఆమెపై ఒత్తిళ్ళ కారణంగా మానసికంగా దెబ్బతిన్నది. గుర్రపు పందాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడింది. గుర్రపు పందాలలో భారీగా నష్టపోయి,



అప్పులపాలయ్యింది. సంపన్న కుటుంబానికి చెందిన అడా విలాసాలు, విచ్చలవిడితనం కారణంగా అనారోగ్యానికి గురవడంతోపాటు చనిపోయేనాటికి 2,000 పౌండ్లు అప్పులు మిగిలాయంటే ఆమె దయనీయస్థితిని అర్థంచేసుకోవచ్చు. అంతటి అనారోగ్యంతో వున్నా ఆమె తెలివితేటలు ఏమాత్రం మందగించలేదు. ఆమె ఆలోచనలను కాస్త కేంద్రీకరించిందంటే ఎంతటి క్లిష్టమైన సమస్యకైనా ప్రోగ్రామ్ రాయగలిగేవారు. బాబేజ్ తన ఎనలైటికల్ ఇంజన్‌ను తన జీవితకాలంలో రూపొందించలేకపోవడంతో అడా రాసిన అనేక ప్రోగ్రామ్‌లు వెలుగు చూడకపోవడం దురదృష్టకరమనే చెప్పాలి. 1852 నవంబర్ 27న లండన్ నగరంలో తన 36ఏళ్ళ వయస్సులో అడా తుదిశ్వాస విడిచింది.

అడా జీవితంలో చీకటి కోణాల మాట ఎలా వున్నప్పటికీ ఆమె అసాధారణమైన ప్రతిభాశాలి. అందానికి, అసాధారణ ప్రోగ్రామింగ్ పరిజ్ఞానానికి మారుపేరైన అడా గణితశాస్త్రానికే వన్నె తెచ్చింది. నేటి ప్రోగ్రామింగ్‌లో వినియోగించబడుతున్న పలు ప్రక్రియలను 150 సంవత్సరాల క్రితమే ప్రవేశపెట్టిన అడా అగస్టా లవ్‌లేస్ ప్రోగ్రామింగ్ రంగానికి అందించిన సేవలను, చేసిన కృషినీ గుర్తిస్తూ యు.ఎస్. రక్షణ సంస్థ పాస్కల్ ఆధారంగా రూపొందించిన లాంగ్వేజ్‌కి 1970లో "అడా" అనే పేరు పెట్టారు. అసాధారణ ప్రతిభాశాలి అడా అగస్టాకు అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నివాళులర్పించడం సముచితం.

-కె.ఎక్స్.రాజు

నునులేత సూర్యుడు



నెమ్మదిగా తలూపే చెట్టునూ
రాల్తున్న మంచు ముత్యాల్ని
ఎగురుతున్న హరివిల్లులా
పక్షుల గుంపుల్ని
నిశ్శబ్దంగా కళ్లు మూసుకుని
దృశ్యాన్ని నాలో వీక్షిస్తున్నాను
అనుభవాలు అంతరాల్లో
దొంతరలుగా పేరుకుపోతున్నాయి
కొన్ని సమయాల్లో
దృశ్యాలుగా జాలువారుతున్నాయి
గాలిలో అలా మేఘాల కెరటాల్లో
గాలిపటాలు తుళ్లిపడుతున్నాయి
శ్వాసతో విచ్చుకుంటున్నాయి
మబ్బులతో ముగ్గులేస్తున్నాయి
ప్రకృతి నిశ్శబ్దాన్ని నాలో మౌనాన్ని
వెలిగించే ధ్యానం
నన్ను నింపుతుంది
తెల్లారే చందమామలా
వెలిగే సూర్యరూపాన్ని
కనుల అరల పొరల్లో
ముచ్చటగా దాచుకుంటాను
పొగమంచు వెన్నెల్లో
నెమ్మదిగా జారుతున్న
నునులేత సూర్యుణ్ణి
జేబులో వేసుకోవాలనిపిస్తుంది
మొక్కల్ని ప్రేమించే సూర్యుణ్ణి
అందాలు వెదజల్లే మొక్కల్ని
ఒకటి ఒకటిగా ఆస్వాదిస్తూ
సూర్యకిరణాలతో స్నానమాడాలనిపిస్తుంది.

బాదం చెట్టు

పరిమళాన్ని సౌందర్యంగా
అలంకరించుకున్న
బాదం చెట్టు
తొంగిచూడాలే కానీ
తొలియవ్వనపు కాంతుల్ని
ఆకులు ఆరబోసుకున్నాయి
విశాల నేత్రాల్లా ఆకులు
చూపుల్ని వెదజల్లుతున్నాయి
గాలి ఆలింగనంతో
తన్మయ దృశ్యంగా
కదులుతూ ఆకులు
స్వరాల్ని మీటుతున్నాయి
పక్షుల పలకరింపులకి
రెక్కలాడిస్తూ
రెమ్మరెమ్మకీ
చిరునవ్వు చిందిస్తూ
సంతృప్తితో ఆరోగ్యాన్ని
విరజిమ్ముతుంది
తొలికిరణం తాకే వేళ
అద్దంలా
ప్రతిబింబిస్తూ
అంతర్యాన్ని అంతఃసూత్రం చేస్తోంది
అలా అలలు అలలుగా
సాగే ప్రయాణంలో
ఆఖరి మజిలీ
పసుపు వర్ణ దృశ్యం
ఆకు రాలు దృశ్యం
నెమ్మది నెమ్మదిగా
గాల్లో ఈదుతూ
బాదం ఆకులు
నేల ఒడిలో
సౌందర్యంగా శాశ్వతంగా
నిద్రపోతున్నాయి.

- గవిడి శ్రీనివాస్

పుష్ప విలాపం

తుమ్మెద రెక్కల శబ్దానికి
కళ్లు విప్పి మేల్కొంది మొగ్గ
పువ్వై విచ్చుకుందిగా
ఇక మొగ్గ జాడలు కనిపించవు
వేగంగా ఓ చినుకు జారి
సుమం నుదుట చుంబించి
మెల్లగా గుండెలో ఇంకిపోతుంది
ఏదో అపరిచిత పవనం
పువ్వుని వాటేసుకుని
ఉక్కిరి బిక్కిరి చేస్తుంది
కొన్ని జతల చూపులు, కొన్ని చేతివేళ్ల స్పర్శ
కలిసి దాడి చేస్తాయి పువ్వుపై
అన్నీ ఎన్నాళ్లు?
పువ్వు వాడిపోనంతవరకే!
వాడిపోయాక...
ఎప్పట్లాగే చినుకు జారుతుంది,
కానీ, మరో తాజాపుష్పం కోసం వెదుకుతూ...
పరిచిత పవనమే వీస్తుంది
కానీ పూరెక్కలు విరిచేస్తూ...
ఇప్పుడు... పువ్వూ లేదు, మొగ్గా లేదు
తడినేలని ముద్దాడిన పూరెక్కల సాక్షి
రాలిపోయినా, పూలు రంగుల బాల వేసి
అతిథి అడుగులు మోస్తున్నాయి
... ఛిద్రమై ఎండిన పూరెక్కల సాక్షి.

- మాల్లారెడ్డి మురళీ మోహన్

తెలుగుభాషలో శోభన్‌బాబుతో రాముడి వేషం కట్టించడమే పెద్ద సాహసం. ఇక నటీనటుల చుట్టూ కాక ప్రకృతి ప్రధానంగా సన్నివేశాల చుట్టూ కథను నడిపించడం వారి కళా కౌశలం. అంతకు ముందు చూసిన రామాయణానికి ఈ చిత్రానికి చాలా తేడా. అందరూ అంతరించిన తర్వాత రావణుడుగా ఎస్వీఆర్‌తో ఆఖరులో పాడించే పద్యాలు చెరగని ముద్ర వేస్తాయి. దాదాపు ప్రతి పాటా హిట్టే. చిత్రం పొడుగునా నేపథ్యంలో సాగే పాట కథను నడిపిస్తుంటుంది.

ఈ చిత్రం ఇచ్చిన ఉత్సాహంతో తర్వాత **సీతాకళ్యాణం** తీశారు. కళాత్మక చిత్రణ గొప్పగా వున్నా కథన గమనం లేనందువల్ల ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ఈ చిత్రంలో గంగావతరణ ఘట్టం మరవరానిది. జయప్రదను సీతగా ముగ్ధమనోహరంగా చూపించారు. అనేక అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో దీనికి మన్నన లభించింది. పౌరాణిక చిత్రాలైనా వీటిలో రమణ సంభాషణలు మాత్రం నిత్యసత్యాల్లా సాగుతుంటాయి.

ముత్యాల ముగ్గు

బాపూ రమణ చిత్రాల్లో మహిళలకు పేదలకు ఎప్పుడూ గౌరవ ప్రదమైన స్థానం వుంటుంది. ముత్యాల ముగ్గు వారి ముద్రను తారాస్థాయికి తీసుకెళ్లింది. అనుకోని పరిస్థితుల్లో గొప్పవారింటి కోడలైన పేదమ్మాయిని అక్కడి రాబందులు పీక్కుతిన్న తీరే ఈ చిత్ర కథ. కాకపోతే రామాయణం ఛాయల్లో నడుస్తుంది. ఆంజనేయుడి పాత్రతో సహా. ఈ చిత్రం సంగీతపరంగానే గాక చిత్రీకరణలోనూ ప్రేక్షకులోకాన్ని పరవశింపచేసింది. మరో వైపున శ్రీధర్‌ను కథానాయకుడిని చేసి, సంగీతను నాయికగా పరిచయం చేసింది. కాంతారావును క్యారెక్టర్ పాత్రలో ప్రతిష్టించింది. నూతన్ ప్రసాద్‌ను తెలుగు తెరకు అందించింది.కానైతే ఈ చిత్రంలో నూటికి నూటయాభై మార్కులు కొట్టేసింది రావు గోపాలరావు కాంట్రాక్టరు పాత్ర. రావి శాస్త్రి తరహా యాసలో దుష్ట కృత్యాలు కొత్త తరహా పద్ధతుల్లో చేసే ఈ పాత్ర 'కళా పోసన' గురించి చెప్పే డైలాగులు శాశ్వతంగా నిలిచిపోవడం కేవలం రమణ చలవే. నాయికను తాకకుండా ఆమెకు తెలియకుండా నాయకుడిలో సందేహం కలిగించి ఆమెను దోషిని చేయడం ఇందులో ఒక కొత్తదనం. సమాజంలో నెమ్మదిగా పెరుగుతున్న కాలుష్యాన్ని ఈ చిత్రం ప్రతిబింబించిందనుకోవాలి.

అందాల రాముడు భద్రాచలానికి బోటు యాత్ర. ధనమదం ఎంత అసహ్యకరమైందో చెబుతుంది. పూర్తిగా గోదావరిపై రంగుల్లో తీసిన ఈ చిత్రం ఒక విధంగా సాధారణమైందే గాని ఇందులో ఆరుద్ర రాసిన 'ఎదగడానికెందుకురా తొందర...' అన్న పాట బాగా జన రంజకమైంది.

కృష్ణంరాజు నిర్మాతగా, నాయకుడుగా అందించిన **'భక్త కన్నప్ప'** కళాత్మకంగానూ సంగీత పరంగానూ విజయం సాధించగా ఆయన **'మనవూరి పాండవులు'** పెత్తందార్లపై యువతరం తిరుగుబాటును చిత్రించి చిరంజీవికి మొదటి పేరు తెచ్చింది.

వాణిశ్రీ నటనా వైభవం గోరంత దీపం

అప్పుడప్పుడే తెర వెనక్కుపోతున్న అసమాన నాయిక వాణిశ్రీని ఆకర్షణా రహితమైన సామాన్య గృహిణి పాత్రలో చూపించిన 'గోరంత దీపం' గొప్ప ప్రయోగమే అనాలి. మంచివాడైనా అమాయకుడైన భర్త, దుష్టసర్పం లాంటి ఆయన మిత్రుడు, పరాన్న భుక్కులైన కుటుంబ సభ్యులు, వీరందరి మధ్యనా ఆ అసహాయురాలు పడిన నరక యాతన ఆఖరులో విజృంభణ ఇతివృత్తం. శ్రీధర్ నాయకుడుకాగా మోహన్‌బాబు ప్రతినాయకుడుగా కపటత్వాన్ని గొప్పగా ఆవిష్కరించాడు. 'రాయినైనా కాకపోతిని, గోరంత దీపం కొండంత వెలుగు' వంటి పాటలు బాగా ప్రసిద్ధం. చిత్రీకరణ చాలా సహజంగా నిరాడంబరంగా వుంటుంది.

తర్వాత కాలంలో **త్యాగయ్య** సంగీత ప్రధానమైంది కాగా **మంత్రిగారి వియ్యంకుడు** రాజకీయ నేతలపై వ్యంగ్యం. **కళ్యాణ తాంబూలం** చాలా చప్పగా సాగిన ఒక ప్రయత్నం. అలాగే **జాకీ.**

కన్నడ చిత్రం ఆధారంగా తీసిన **వంశ వృక్ష** కూడా కులభేదాలను నిరసించే మానవతా సందేశం ఇస్తుంది. అయితే విషాదాంతం. ఈ చిత్రంలో రమణ సంభాషణలు గుండెను బరువెక్కిస్తాయి.

ఎన్టీఆర్‌తో **శ్రీరామాంజనేయ యుద్ధం** తీసి విజయం సాధించిన బాపూ రమణలు ఆయన ముఖ్యమంత్రిగా వుండగా **శ్రీనాథ కవిసార్వభౌముడు** రూపొందించారు. చాలా ఏళ్ల తర్వాత విడుదలైంది. చిత్రణ బాగున్నా వీరుడైన ఎన్టీఆర్ కవిగా పెద్దగా ఆకట్టుకోలేదు. పైగా అప్పటికే ఆయన వయస్సు బాగా ఎక్కువ కావడంతో నిరాశ మిగిలింది.

శ్రీకారం చుట్టుకున్న పెళ్లిపుస్తకం

చాలా కాలం వ్యవధి తీసుకున్న తర్వాత 1991లో **పెళ్లిపుస్తకంలో** రాజేంద్రప్రసాద్‌తో మరోసారి తమ శైలిలో చిత్రం రూపొందించారు బాపూ రమణలు. పైన పేర్కొన్న ఈ చిత్రం టైటిల్ గీతం తెలుగింటి పెళ్లి పందిళ్లలో స్థిరపడిపోయింది. మిస్సమ్మ కథను అటు తిప్పి తీసిన ఈ చిత్రం ఆర్థికంగానూ విజయం సాధించింది.

మిస్టర్ పెళ్లాం

రాజేంద్ర ప్రసాద్, ఆమని జంటతో స్త్రీల ప్రతిభా సామర్థ్యాలను గుర్తించాలని చెబుతూ మిసెస్‌ను కాస్తా మిస్టర్‌గా చేసి తీసిన ఈ చిత్రం కూడా మంచి సందేశం ఇవ్వడమే గాక జాతీయ స్థాయి పురస్కారం పొందింది.

తర్వాత తీసిన వాటిలో రాధాగోపాలం కూడా భార్య స్వతంత్ర పాత్రను నొక్కి చెబుతుంది. చార్మీతో తీసిన సుందరకాండ మాత్రం తేలిపోయింది.

కమ్మదనం.. తెలుగు స్వరం

ఎంత చెప్పుకున్నా బాపూ రమణల చిత్రాల ప్రత్యేకతలు తరిగేవి కావు. వాటిలో తెలుగుదనంతో కమ్మటి అభిరుచితో నేత్రపర్వమైన చిత్రణతో నడిచే ఆ చిత్రాల్లో అధిక భాగం హాస్యానికి భాష్యం చెబుతాయి. మానవతకు పట్టం కడతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయపు ఛాయలున్నా పునరుద్ధరణ ధోరణి కనిపించకుండా జాగ్రత్తపడతారు గనక కుటుంబ సమేతంగా చూసేలా వుంటాయి. ★

నవ్వుల్ - పువ్వుల్

క్లాత్ ట్రూత్

టీచర్: రవీ పరీక్ష పేపర్లో మీ నాన్న పేరు రాయమంటే 'క్లాత్ ట్రూత్' అని రాశావెందుకు?

రవి: మరి! మా నాన్న పేరు 'బట్టల సత్యం' టీచర్. మరి ఆయన పేరును ఇంగ్లీషులో అలాగే కదా రాస్తాం.

షుగర్

ఒకటవ తేనెటీగ: మిత్రమా! రా... మనం వెళ్లి తేనె పోగుచేసుకుని వద్దాం.

రెండవ తేనెటీగ: నేను రాలేను మిత్రమా.

ఒకటవ తేనెటీగ: ఏం?

రెండవ తేనెటీగ: ఎందుకంటే నాకు సుగర్ ఉంది.

కూర

వంటవాడు: ఏవండీ... ఈరోజు ఏ కూర వండమంటారు?

యజమాని: నా తలకాయ కూర వండు.

వంటవాడు: వేపుడు చెయ్యమంటారా? కూర చెయ్యమంటారా?

- ఎం. దయలీల, నాగులపల్లి, అనకాపల్లి.

పొట్ట తగ్గే చిట్కా

గోపి: ఏమిట్రా? ఈ మధ్య పొట్ట తగ్గి నాజూగ్గా తయారవుతున్నావ్. ఏం మందులు వాడుతున్నావ్?

గోవింద్: మందులా పాడా! ఇంటి పనులు చేస్తున్నాను. బట్టలు ఉతకడం, అంట్లు తోమడం, వంట పనిలో కొంత సాయం చేయడం...

ప్రేమ కోసం

ప్రేమ పిపాసి: గురువు గారూ... నేనొక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. కానీ ఆ అమ్మాయి నా ముఖం కూడా చూడ్డం లేదు. ఏం చెయ్యమంటారు?

గురువు: ఆ అమ్మాయి కాలి చెప్పు నీ మీద విసిరిందా?

ప్రేమ పిపాసి: లేదండి.

గురువు: విసిరితే గనక, థ్యాంక్యూ మిస్... మీ చెప్పులను రోజూ పూజిస్తా అని చెప్పి చూడు.

హోం వర్క్

తండ్రి: రాజూ! ఈ రోజు స్కూల్లో ఏం హోంవర్క్ ఇవ్వలేదా?

రాజు: ఇచ్చారు నాన్నా. ఇంట్లోని దోమల్ని, నల్లుల్ని చంపమన్నారు.

తథాస్తు

గృహస్థుడు: సంసార జీవితం మీద విసుగు పుడుతోంది. పిచ్చి పట్టేలా వుంది.

సాధువు: ఐతే నీ ఆస్తులు, డబ్బు మా ఆశ్రమం పేరున దానం చెయ్యి మహానుభావా!

అనుభవం

వెంకటేష్: అదేమిట్రా! చేతి వేళ్లకి బ్యాండేజి వేసుకున్నావ్.

సతీష్: గులాబీలను పట్టుకుంటూ కవిత్వం రాద్దామనుకున్నాను. ముళ్లు గుచ్చుకున్నాయి.

సలహా

బావమరిది: ఉద్యోగం దొరికే వరకు ఏదైనా ఉపాధి చూపించు బావా.

బావ: బీచ్‌లో బఠానీలు, పల్లీలు అమ్మడం మొదలుపెట్టు. ఉద్యోగం లేనప్పుడు నేనూ అదే పని చేశాను.

విచిత్రం

విలేకరి: సర్, మీ 'విచిత్రం' సినిమా ఎప్పుడు తీస్తున్నారు?

కొత్త నిర్మాత, దర్శకుడు: ఫైనాన్స్ చేసే వాళ్ల కోసం వెతుకుతున్నా. దొరగ్గానే ప్రారంభిస్తా.

దేశాటన

శిష్యుడు: గురువుగారూ! నాక్కూడా కొంత కాలం దేశాటన చేయాలని ఉంది. ఆశీర్వదించండి. వెళ్లొస్తా.

గురువు: వద్దు నాయనా! నువ్వెళ్లి నా పని కుక్కలు చింపిన విస్తరి చేయకు. భక్తుల కలెక్షన్ తగ్గుతుంది.

జె. సుధాకరరావు పట్నాయక్, కాకినాడ.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

కొత్త పుస్తకాలు

హృదయ సాహిత్యం

కరుణశ్రీ అనగానే పుష్పవిలాపం, కుంతీకుమారి గుర్తుకు వస్తాయి ఎవరికయినా. పద్యం పండితులకే తప్ప సామాన్య పాఠకులకు అందగలిగేది కాదన్న విషయాన్ని పరాస్తం చేస్తూ పద్యాన్ని అంత లలితంగా మలచి ప్రసిద్ధ ఖండాకృతులను ఎన్నింటినో ఇక్షుఖండం అంతా రసవంతంగా వెలయించారు ఆయన. జంధ్యాల పాపయ్యశాస్త్రి ఆయన అసలు పేరయినా సాహిత్యలోకంలో కరుణశ్రీగానే ప్రఖ్యాతులు. ఘంటసాలకు గాయకునిగా పేరు రావడానికి తొలినాళ్లలో కరుణశ్రీగారి పద్యాలు ప్రయివేటు రికార్డులుగా పాడి వెలయింపబడడం ఒక కారణం కాగా ఘంటసాల పాడడంతో కరుణశ్రీ సాహిత్యానికి ప్రాచుర్యం లభించడం పరస్పరాశ్రితాలుగా పేర్కొనవచ్చు. కరుణశ్రీగారి కవితాశైలి ఆయనకే సొంతం అనదగింది. ఒక ప్రసన్నత, అక్షరరమ్యత, దృశ్యకరణ నైపుణ్యం ఆయన పద్యరచనలో హృద్యంగా తొంగిచూస్తుంటాయి. 'అది ఒక రమణీయ పుష్పవనం. ఆ వనము నందొక బాలిక" అనే కుంతీకుమారి ఖండికలోని తొలిపద్యమే కెమెరాతో ఒక దృశ్యాన్ని మన కనుల ముందుకు క్రమంగా తీసుకువచ్చి నిలిపినట్లుంటుంది. ఇక కరుణశ్రీ పద్యాల్లోని రసాత్మకత హృదయంగమమైనది. పండిత పామరులందరూ పాడుకునే పద్య రచన కరుణశ్రీగారిది. ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ పేర్లతో ఆయన కృతులు వెలయిస్తూ వచ్చారు. 1944లో నవ్యసాహిత్య పరిషత్తు ప్రథమ ముద్రణగా వచ్చిన ఉదయశ్రీ యాభైసార్లు పునర్ముద్రింపబడింది. కవిత్వ రంగాన ఈ ఘనత కరుణశ్రీ గారికే దక్కుతుందేమో! కరుణశ్రీ గారి పద్యాలకు వడ్డాది పాపయ్య, బాపు వంటి ప్రముఖ చిత్రకారులు రసప్లావితులై సౌందర్య భరిత చిత్రరచనలు చేశారు. కరుణశ్రీ సాహిత్యం ఉదయశ్రీ అయిదు భాగాల సమగ్ర సంపుటిని ఇప్పుడు విశాలాంధ్రవారు మళ్లీ వెలుగు దివ్వెగా ఈ తరం తెలుగు వారికి అందిస్తున్నారు. అంజలి నుండి కల్యాణశారద వరకు జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి ఉదయశ్రీ ఖండ కృతులన్నీ ఇందులో ఉన్నాయి. అద్వైత మూర్తి, సాధ్యశ్రీ, పుష్పవిలాపం, కుంతీకుమారి, కరుణామయి, రాట్నసుందరి, ధనుర్భంగము వంటి ప్రసిద్ధ రచనలన్నీ ఇందులో ఉన్నాయి. సీతాకళ్యాణ ఘట్టంలో "ఫెళ్లుమనె విల్లు గంటలు ఘల్లుమనె గుభిల్లుమనె గుండె నృపులకు ఝల్లుమనియె జానకీదేహమొక నిమేషమ్మునందె నయము. జయమును భయము విస్మయముగదర" అని కరుణశ్రీగారు రాసిన పద్యం సీతారాముల కళ్యాణం జరుగుతున్నన్నాళ్లు రామాయణం నిలుచున్నన్నాళ్లూ నిలిచే ఉంటుందనడం అతిశయోక్తికాదు.

భుట్టోషష్టాకము, కరాచీతో ఢిల్లీ, యాహ్యాసప్తకము వంటి ఖండికలు రాజకీయ అంశాలను కూడా కరుణశ్రీ గారు పద్యగతం చేసిన ప్రతిభకు దృష్టాంతాలు. స్టాలిన్ మరణవార్త విని కరుణశ్రీ కవిత రాసిన విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. లలిత లలిత పదాలతో బాలలకూ అలాగే తేటవచన కవితలనూ కూడా ఆయన రాశారు. స్నిగ్ధ మధురహాస! శ్రీనివాస! అనే మకుటంతో శతకపద్యాలవంటివీ ఆయన సామాజికాంశాలతో రచించారు. వీటన్నింటినీ సంతరించుకున్న సంపుటిగా ఉదయశ్రీ అయిదు భాగాల సమగ్రసంపుటి భాసిస్తోంది.

కరుణశ్రీ సాహిత్యం - 1, ఉదయశ్రీ (ఐదు భాగాల సమగ్ర సంపుటి) డాక్టర్ జంధ్యాల పాపయ్య శాస్త్రి, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, వెల : 200/-.

- సుధామ

వైవిధ్యాలకు సాక్షి 'పిచ్చుకగూళ్లు'



మోదేపల్లి శ్రీలత రచించిన 'పిచ్చుకగూళ్లు' కథల పుస్తకం వెనుకబడిన తరగతులకు చెందిన కుటుంబాల తీరును ముఖ్యంగా మహిళల జీవన సరళిని కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ కథల ద్వారా లంబాడీల జీవన విధానాన్ని చాలా దగ్గరగా చూడొచ్చు. దళిత స్త్రీల మనోభావాలనూ, సంప్రదాయాలనూ, మూఢనమ్మకాలనూ, అమాయకత్వాన్నీ, కాయకష్టం చేయగలిగిన సత్తానూ, మోసపోయే గుణాన్నీ రచయిత్రి కథావస్తువులుగా ఉపయోగించుకున్నారు. అధికశాతం కథలు లంబాడీల జీవితాల్లోని ఎత్తుపల్లాలను ఆవిష్కరిస్తాయి. అదేవిధంగా దళిత మహిళలు ఆచారాలకు ఏవిధంగా బలౌతున్నారో వాటిలోని పాత్రలు కళ్లకు కడతాయి. 'నాయకి' కథలో హసిలీ పాత్ర సంప్రదాయానికీ, మమకారానికీ మధ్య నలిగిపోతుంది. మమకారంతో సంప్రదాయానికి తలొగ్గి కొడుకులాంటి వికలాంగ మరిదిని పెళ్లి చేసుకుంటుంది. రెంటికీ మధ్య హసిలీ పడే ఆవేదన వర్ణనాతీతం. 'మెరుపు' కథలో లక్ష్మి 'ఓలిగట్టి విడిపించుకుంటానన్న భర్తకు తానెందుకు ముండమోయాలి' అని తిరస్కరిస్తుంది. లక్ష్మి, ఆమెకు భరోసా ఇచ్చే నాయనమ్మ పాత్రలు ఆదర్శంగా ఉంటాయి. 'యాడి' కథలో ఓలిగట్టి సోమ్లిని భర్త దగ్గరనుండి విడిపించుకు రమ్మని ఆమె తల్లితోనే చెప్తాడు దొర. ఓలికి ఆశపడి భర్తకూడా పంపించేస్తాడు. అయితే సోమ్లి పథకం వేసి దొరను చంపడం పాఠకులలో ఆలోచనను రేకెత్తిస్తుంది. ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే ఆచార, సంప్రదాయాలను, కట్టుబాట్లను లెక్కచేయాల్సిన అవసరం లేదని 'తొడుగు' కథలోని ముస్లిం మహిళ పాత్రలు రుజువు చేస్తాయి. అమెరికాలో ఉన్న కొడుకుకోసం తల్లిపడే ఆరాటం, కొడుకు చూపించే నిర్లక్ష్యం 'పిచ్చుకగూళ్లు' కథలో కన్పిస్తుంది. ఇండియాకు వచ్చిన కొడుకు తల్లిని కూడా చూడకుండా వెళ్లడం గుండెల్ని బరువెక్కిస్తుంది. 'త్యాగం ఖరీదు'లో పడవతోపాటు నీటిలో కొట్టుకుపోయిన పిల్లలను రక్షించి ఏడుకొండలు చచ్చిపోతాడు. త్యాగమూర్తి అని పెద్ద హెడ్డింగ్‌తో వార్తలు వస్తాయి తప్ప మారు ఫలితం ఉండదు. నిరుపేదల బతుకుల్లోని ఎత్తుపల్లాలను 'బండిచక్రాలు' కథలో చూపడంలో రచయిత్రి కృతకృత్యులయ్యారు. తరతరాలుగా చేస్తున్న వెట్టికి తన పిల్లలనైనా దూరంగా ఉంచాలని కష్టపడి దొర అప్పు తీరుస్తారు. కూలికి వెళ్తుంటారు. పంటలు పండకపోవడంతో మళ్లీ దొర చేతిలో బానిసలుగా మారాల్సి వస్తుంది. కాలంతోపాటు పెట్టుబడిదారులు, పెట్టుబడులు పెరుగుతూ, మారుతూ ఉంటాయి. కాని నిరుపేదల బతుకు కాలచక్రంలో ఇరుసు వంటిదని ఈ కథలో శ్రీలత చక్కగా చెప్పారు. 'చిదంబరం' కథలో నీరజ పాత్ర సగటు మహిళకు ప్రతిబింబం. నీరజ మధ్యతరగతి ఉద్యోగస్తురాలు. భర్తకంటే ఎక్కువ సంపాదిస్తుంది. అయినా ఆర్థిక స్వేచ్ఛ ఉండదు. చివరికి తను తీసుకునే నిర్ణయం మహిళలందర్నీ ఆలోపింపజేసేలా ఉంటుంది. 'అడకత్తెర'లాంటి హాస్య వంటకాలు వండటంలోనూ రచయిత్రి పట్టు కనబడుతుంది. జాతకాల పిచ్చితో నవరత్నారావు నాశనమైన తీరు ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న అనేక జాడ్యాలనూ, ఈజీగోయింగ్ నేచర్‌నూ 'అదృష్టం' కథలో రచయిత్రి బాగా చెప్పారు. శ్రీలత కథలన్నీ ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ఆమె వాడిన వ్యావహారిక భాష చక్కగా ఉంది. చదువుతున్నంత సేపు ఆ పాత్రల్లో లీనమై పోతాం.

పిచ్చుకగూళ్లు-మోదేపల్లి శ్రీలత, పేజీలు : 139, వెల : 60/-, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

-సిహెచ్.లక్ష్మి

చూద్దామా



ఆ ప్రదేశాన్ని చూస్తే అక్కడే ఉండిపోవాలనిపిస్తుంది. ఎత్తైన జలపాతం... 20 మీటర్ల ఎత్తునుండి కిందకి నీళ్లు పడుతుంటే అలుముకున్న పొగలాంటి నీటితుంపరలు... చుట్టూ పచ్చని చెట్లు... అంతేనా! ఇంకా ఎత్తైన కొండల నడుమ సాగే నదిలో చిన్న చిన్న పుట్లమీది ప్రయాణం ఓహ్... ఆ అనుభూతే వేరు. ఈ జలపాతం ఉంది ఎక్కడో కాదు! మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోని ధర్మపురికి 44 నాలుగు కిలోమీటర్ల దూరంలోనే!! అదే హొగెనక్కళ్ జలపాతం. దీన్నే భారత నయాగరా అని కూడా అంటారు. మరైతే ఈ వారం ఆ వివరాలేంటో చెప్పకుందాం.

మన నయాగరా

కర్ణాటకలోని కొడుగు జిల్లా బ్రహ్మగిరి కొండల్లోని తలకావేరి వద్ద కావేరి నది ప్రారంభమై... ఎన్నో చిన్న చిన్న ఉపనదులను కలుపుకుంటూ వెళ్లి హొగెనక్కళ్ వద్ద జలపాతంగా ఏర్పడింది. ఇది తమిళనాడు, కర్నాటక సరిహద్దు ప్రాంతంలో ఉంది. ఇక్కడి నుంచి దక్షిణ దిశగా ప్రవహించి మెట్టూరు ఆనకట్ట వద్ద స్టాన్లీ జలాశయంలో కలుస్తుంది.

ఆ పేరెలా వచ్చిందంటే...

కన్నడంలో 'హోగె' అంటే పొగ. 'కల్' అంటే బండరాయి అని అర్థం. అత్యంత వేగంతో ప్రవహించే నది అక్కడి బండరాళ్లపై నుండి కిందికి ప్రవహించేటప్పుడు మంచు బిందువులు పొగ రూపంలో కమ్ముకుంటాయి. అందువల్లే ఆ జలపాతానికి హొగెనక్కళ్ జలపాతం అని పేరొచ్చిందని స్థానికులు చెపుతారు. కొన్ని మైళ్ల వైశాల్యంలో ఉన్న ఈ జలపాతం అక్కడికొచ్చిన వారికి కనువిందు చేస్తుంది.

ఎన్నో ఔషధ గుణాలు...

ఈ జలపాతం నీటిలో చాలా ఔషధ గుణాలున్నాయని అక్కడి ప్రజలు చెబుతారు. అందుకే ఈ నీటిలో స్నానం చేస్తే ఎటువంటి రోగాలైనా నయమవుతాయని నమ్ముతారు. హొగెనక్కళ్ చేరే కావేరీనది అడవులగుండా ప్రవహిస్తుంది. అక్కడ ఎన్నో వనమూలికలు వున్నాయట. వాటి ప్రభావం వల్లే ఆ నీటికి అంతటి శక్తి ఉందని అంటారు. ఈ జలపాతానికి వెళ్లే మార్గంలో టెర్రకోట అనే గ్రామం కనిపిస్తుంది. అక్కడ అందమైన తోటలను కూడా చూడొచ్చు. తమిళనాడు ప్రభుత్వం 'హొగెనక్కళ్ జలపాతం దగ్గరికొచ్చిన పర్యాటకులు స్నానం చేయడానికి స్నాన ఘట్టాలను కూడా ఏర్పాటు చేసింది. చుట్టూ మల్బరీ తోటలతో అందమైన పరిసరాలతో ఉండే ఈ ప్రదేశం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జలపాతానికి సరిహద్దు గ్రామాల్లో ఎర్రమట్టితో తీర్చిదిద్దిన గ్రామదేవతల విగ్రహాలు దర్శనమిస్తాయి.

పుట్లమీద ప్రయాణం....

హొగెనక్కళ్ జలపాతంలో పుట్లమీది ప్రయాణం (బోటింగ్) ఒక మధురానుభూతి. అయితే కేవలం వేసవికాలంలో మాత్రమే ఇక్కడ బోటింగ్ చేయడానికి అనుమతినిస్తారు. ఎందుకంటే వర్షాకాలంలో నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. స్థానికంగా దొరికే వెదురుతో అల్లిన గుండ్రని పుట్లను (తెప్ప బోట్లు) బోటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. అంతేకాదు ఆ ప్రదేశాల్లో తినుబండారాలను అమ్మే స్టాల్స్ కూడా ఉంటాయి. తాజా చేపలతో చేసిన వేడి వేడి చేపల పులుసు, చేపల వేపుడు ఇక్కడి ప్రత్యేక వంటకాలు. రుచికరమైన ఈ వంటకాల్ని పర్యాటకులు ఎంతో ఇష్టంగా తింటారు. తమిళనాడే కాకుండా కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ఇక్కడికి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు.

★



నడుస్తున్న చరిత్ర 'మోడర్న్ టైమ్స్'



చార్లీ చాప్లిన్ ఎవరు? నవ్వించేవాడు. ఆయన సినిమాలు నవ్వు కాని చూసేవారిని నవ్వకుండా ఉండనివ్వవు. ఆయన సినిమాలే కాదు ఆయన ఆహార్యం, అభినయం, నటన... అన్నీ హాస్యప్రియులకు టానిక్కులే.

చార్లీచాప్లిన్ కేవలం ప్రఖ్యాత హాస్యనటుడు మాత్రమే కాదు. గొప్ప మానవతావాది, అభ్యుదయవాది, శాంతి ప్రియుడు, ధీరోదాత్తుడు. తను (పాత్ర) అనుభవించే బాధలను హాస్యం అద్ది మరీ ఇతరులకు చేరవేసే ప్రతిభావంతుడు. హిట్లర్ లాంటి క్రూరుణ్ణి సైతం అలవోకగా "గ్రేట్ డిక్టేటర్" పేరిట విమర్శించిన ధీరుడు. అటువంటి చాప్లిన్ చేతిలో ప్రాణం పోసుకున్న "మోడర్న్ టైమ్స్" చిత్రం రూపొంది ఫిబ్రవరి 25 నాటికి డెబ్బై ఐదేళ్ళు పూర్తయ్యింది.

చాప్లిన్ స్వీయ రచన, దర్శకత్వం, నిర్మాణంలో పురుడు పోసుకున్న ఈ చిత్రం 1936 ఫిబ్రవరి 25న తెరపై ఆవిష్కృతమైంది. నాటి నుంచి మోడర్న్‌టైమ్స్ ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ తన లాభాల కోసం అనుసరించే పద్ధతులు అనివార్యంగా కార్మికలోకాన్ని పోరాటాల్లోకి ఎలా నడిపిస్తాయి? ఆ పోరాటాలను అణచటానికి రాజ్యాంగ యంత్రాన్ని ఎలా ఉపయోగిస్తుంది? విసిగి వేసారిన జనం జైళ్ళను సైతం ఎలా తునాతునకలు చేస్తారో చూపించిన దృశ్యకావ్యం మోడర్న్ టైమ్స్. పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీదురాశతో సగటు కార్మికుడి శారీరక మానసిక స్థితి ఎంత దుర్భరంగా తయారౌతుందో చూపించే సజీవచిత్రం మోడర్న్ టైమ్స్. మోడర్న్ టైమ్స్ విడుదలైన నాటి, నేటి ప్రపంచ స్థితిలో సారూప్యత ఉంది. అదేమంటే ఆర్థిక సంక్షోభం, దాని మూలాలు. గ్రేట్ డిప్రెషన్‌గా పేర్కొనబడిన నాటి సంక్షోభం నేడు పునరావృతం అవుతోంది. సంక్షోభాలు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సహజ పుత్రికలు. లెనిన్ మహాశయుడు చెప్పిన విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అంతిమ రూపమైన సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ నేడు ప్రపంచమంతటిని అనివార్యంగా తనతో పెనవేసుకునేట్టు చేసింది. ఫలితమే ప్రపంచ ఆర్థికసంక్షోభం. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థే అంతిమ దశ అన్న పెట్టుబడిదారీ వందిమాగధులు కూసిన నక్క కూతలు తప్పని నేటి ఆర్థిక సంక్షోభం మరింత విశదీకరించింది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుల శ్రమ దోపిడి దాని పర్యవసానాల ప్రతిబింబమే మోడర్న్‌టైమ్స్. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏ ఆధారం లేని కార్మికులు తమ శ్రమశక్తిని ఎలా అమ్ముకుంటారు? పెట్టుబడి తన లాభాల కోసం ఉద్యోగాలు ఎలా ఊడగొడుతుంది? నిరుద్యోగం ఎలా ప్రబలుతుంది? అనివార్య పరిస్థితుల్లో అది ఉద్యమంగా ఎలా రూపుదిద్దుకుంటుంది? ఉద్యమాన్ని అణచివేసే చర్యలను కార్మికశక్తి ఎలా ప్రతిఘటిస్తుంది అనే అంశాన్ని కథావస్తువుగా మలచి చాప్లిన్ తనదైన శైలిలో మోడర్న్‌టైమ్స్‌ను అద్భుతంగా ఆవిష్కరించాడు.

చాప్లిన్ సినీ జీవితం 1914లో 'మేకింగ్ ఎ లివింగ్' సినిమాతో ప్రారంభమైంది. 1915 నాటికి సినిమాలు రాయటం, దర్శకత్వం వహించటం, నిర్మించటం వరకు చేరింది. మోడర్న్ టైమ్స్‌కు ముందు ఇతర సినిమాలు నిర్మించినా, చాప్లిన్‌ను మహోన్నతంగా నిలిపింది మోడర్న్ టైమ్సే. 87 నిమిషాల నిడివి గల సినిమాను నిర్మించటానికి నాడు 15 లక్షల డాలర్లు వెచ్చించాడు. రచయిత, దర్శకుడు, నిర్మాతగానే కాక సంగీత దర్శకుడిగా కూడా చాప్లిన్ వ్యవహరించటం మరో విశేషం. వాషింగ్టన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ చే "కల్చరల్లీ సిగ్నిఫికెంట్" అవార్డును, 1974 లో జూస్సీ, 1989లో నేషనల్ ఫిలిం రిజిస్ట్రీ అవార్డులను గెలుచుకుంది. 2004లో గోల్డెన్ శాటిలైట్ అవార్డుకు నామినేషన్ పొందింది. సినిమా ప్రారంభంలో గొర్రెల మాదిరి ఫ్యాక్టరీలోకి వెళ్లే కార్మికులు, సినిమా ముగింపుకు వచ్చేసరికి స్వేచ్ఛా జీవులుగా బయటకి వస్తారు. పెట్టుబడిదారుడు కార్మికుడిని మిగతా యంత్రాల మాదిరిగానే యంత్రంగా భావించి శ్రమశక్తి కొనుగోలు చేస్తాడు. కాని మనిషి ఎప్పటికీ యంత్రం కాదు. అనివార్యంగా తనను తాను పెట్టుబడిదారీ సంబంధాల నుండి విముక్తి చేసుకుంటాడు అని స్పష్టం చేస్తాడు చాప్లిన్.

కార్ల ఫ్యాక్టరీలో వేగంగా నడిచే అసెంబ్లింగ్ యూనిట్ బెల్టుపై నట్లు బిగించే కార్మికుడిగా చాప్లిన్ నటన అద్భుతం. విరామం లేకుండా శ్రమను దోచుకోవటానికి భోజనం తినిపించే యంత్రాన్ని కూడా ప్రవేశ పెట్టడం... క్రమంగా బెల్టు వేగం పెంచటం వల్ల నట్లు తిప్పటానికి పరిమితమై, మానసిక రోగిగా మారతాడు. రోడ్డుమీద వెళ్తున్న లారీ ఇనుప చువ్వలకు కట్టిన ఎర్రగుడ్డ పడిపోవటం... కాకతాళీయంగా దానిని చాప్లిన్ చేతిలోకి తీసుకొని నడవటం... విశ్రాంతి లేకుండా శ్రమదోపిడీకి గురైన కార్మికులు విసిగి వేసారి... ఎర్రగుడ్డ పట్టుకున్న చాప్లిన్ వెనకాల పరుగెత్తడంతో అది కాస్త కార్మిక ప్రదర్శనగా కమ్యూనిస్టు ఉద్యమ రూపం సంతరించుకోవటం యాదృచ్ఛికంగా జరిగిపోతుంది. ఫలితంగా నిరుద్యోగిగా ఉన్న చాప్లిన్‌ను అరెస్టు చేసి, జైలుకు పంపుతారు. ఉప్పు అనుకుని కొకైన్ అనే మాదక ద్రవ్యాన్ని తిన్న చాప్లిన్ మత్తులో వెళ్ళి జైలు ఊచలను గట్టిగా ఉపుతాడు. దాంతో తోటి ఖైదీలందరూ జైలును బద్దలు గొట్టుకుని స్వేచ్ఛా జీవులౌతారు.

జైలు నుండి బయట పడ్డ చాప్లిన్‌కు జైలు బయట బతకటం దుర్భరమౌతుంది. మంచి ఉద్యోగం సంపాదించే ప్రయత్నంలో మళ్ళీ అరెస్టవుతాడు. ఆ తర్వాత ఓ కేఫ్‌లో పనికి కుదురుతాడుగానీ... తోటి కార్మికులు సమ్మెకు దిగారని పత్రిక ద్వారా తెలుసుకున్న చాప్లిన్ తనకు తెలియకుండానే పోలీసుల వైపు ఇటుక విసరడంలో మళ్ళీ అరెస్టు అవుతాడు. అనంతరం కేఫ్‌లో ఉద్యోగం చేసే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దశలో పోలీసులు మళ్ళీ అరెస్టు చేయటానికి రావటం, తప్పించుకొని భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ రోడ్డుమీద నడుస్తూ వెళ్ళటంతో సినిమా ముగుస్తుంది.

ఈ చిత్రం ద్వారా చాప్లిన్ తన సహజసిద్ధమైన హాస్యం-వ్యంగ్యంతో పెట్టుబడిదారీ వ్యవస్థ అసలు రూపాన్ని చూపాడు. పెట్టుబడిదారి వ్యవస్థ స్వభావాన్ని, క్రూరత్వాన్ని కళ్ళకు కట్టే హాస్యచిత్రం 'మోడర్న్ టైమ్స్'. సమాజ చలన సూత్రాలను, ప్రజల వాస్తవిక జీవితాలను సినిమాగా మలిస్తే ఎంత గొప్ప ఆయుధంగా మారుతుందనడానికి మోడర్న్ టైమ్స్ ఒక ఉదాహరణ. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత కాలం మోడర్న్‌టైమ్స్ సజీవమే. అనంతరం అది చరిత్ర. అంటే నడుస్తున్న చరిత్రే కదా.

- కె.భాస్కర్



పరీక్షలు... పాఠాలు...

పరీక్షల కాలం ప్రారంభమైంది. ఎప్పటిలాగే విద్యార్థులు మొదలుకొని విద్యాయంత్రాంగం వరకు ఒక వైపు అప్రమత్తత మరోవైపు అభద్రత. పరీక్షలు సమర్థవంతంగా రాయాలని విద్యార్థి, సమర్థవంతంగా నిర్వహించాలని విద్యా యంత్రాంగం హోరాహోరీ పోరాడుతుంటారు. అదే సమయంలో ఏం జరుగుతుందోననే భయం వెంటాడటంతో అభద్రత అనివార్యమవుతుంది. రోజురోజుకూ పరీక్షలకు పెరుగుతున్న శ్రుతి మించిన ప్రాధాన్యత విషయంలో కనిపించే అశాస్త్రీయ ధోరణులు - సమతుల్యతలే ఒక విధంగా ఆందోళనకు కూడా కారణమవుతున్నాయి. ఎందుకంటే 30,40 సంవత్సరాల కిందట పరీక్షల కాలాన్ని నేటి పరీక్షల కాలంతో పోల్చి చూస్తే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. పరీక్షలు...పాఠాలకు సంబంధించిన వివరాలు ఈవారం అట్టమీది కథలో....

చుక్కా రామయ్య,
ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు.

కాలానుగుణంగా పరీక్షా పద్ధతుల్లో పరీక్షల నిర్వహణలో అనేక మార్పులొచ్చాయి. పరీక్షా ఫలితాలే విద్యార్థుల విజయానికి గీటురాయిగా, ఉపాధ్యాయుల సామర్థ్యానికి, తల్లిదండ్రుల శ్రద్ధకు గీటురాయిగా పరిగణించడం అందులో ప్రధానమైంది. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు సార్థకతను పరీక్షా ఫలితాలతోనే, ఇంకా చెప్పాలంటే ర్యాంకులు మార్కులతోనే ముడిపెట్టి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉపాధ్యాయుల జవాబుదారీతనానికి కూడా పరీక్షా ఫలితాలే ఏకైక కొలబద్దలయ్యాయి. చివరికి విద్యాయంత్రాంగం సమర్థతను కూడా పరీక్షా ఫలితాల ఆధారంగానే అంచనా కడుతున్నారు. ఇలా కేవలం విద్యా రంగానికే గాక సమాజంలో ప్రతి వారికి పరీక్షలే ప్రధాన సవాళ్లుగా తయారవడాన్ని తరచి చూస్తే... గతంలో బోధనాభ్యాసన ప్రక్రియకు ఇచ్చిన స్థానం, నేడు దాదాపు కనుమరుగుకావడం వెక్కిరిస్తున్న కారణంగా కనిపిస్తుంది.

ప్రక్రియ- ఫలితం

గతంలో ఉపాధ్యాయుడు పాఠం చెప్పడానికి ఎలా సిద్ధమయ్యాడు? దాన్ని విద్యార్థికి నేర్పించే ప్రయత్నం ఎలా చేస్తున్నాడనేది ప్రధానాంశంగా వుండేది. అలాగే విద్యార్థి పాఠాన్ని నేర్చుకునే ప్రయత్నంలో ఏం చేశాడు? ఎలా చేశాడు? అనేది ప్రధానంగా చూసేవారు. ఇందులో ఒకటి ప్రక్రియ మరొకటి ఉత్పాదన. ఒకటి ప్రాసెస్. మరొకటి ప్రాడక్ట్. బోధనాభ్యసన ప్రక్రియలోని కీలక వ్యక్తులైన ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇరువురిని 'ప్రాసెస్' అనేది గమ్యనిర్దేశం చేసేది. పరీక్షా ఫలితాలనేవి ఆ ప్రాసెస్ వల్ల వచ్చే ప్రొడక్ట్‌గా చూడబడేది. ప్రొడక్ట్ కంటే ప్రాసెస్‌కు ఎక్కువ ప్రాధాన్యతివ్వడం నాటి పద్ధతి.

అనేక కారణాల వల్ల నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.. ప్రాధాన్యతా క్రమం తలకిందులైంది. ప్రాసెస్‌ను వెనక్కునెట్టి ప్రాడక్ట్ ముందుకొచ్చింది. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలనేదే కాదు. సిలబస్ కూడా పరీక్షల తీరు తెన్నులను బట్టి నిర్ణయమైపోతున్నది. పదో తరగతి ఇంటర్ వంటి బోర్డు పరీక్షలతోపాటు ఎంసెట్, ఐఐటి వంటి పోటీ పరీక్షల వరకు ప్రతిదీ ప్రామాణికం, స్థిరీకరణం చేసేపని విద్యాయంత్రాంగం తనపైన వేసుకున్నది. దాంతో పాఠం చెప్పే ఉపాధ్యాయుడే విద్యార్థిని పరీక్షించే రోజులు పోయాయి. అంతా కేంద్రీకృత పద్ధతిలో జరగడం ప్రారంభమైంది. రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో ప్రశ్నాపత్రాన్ని రూపకల్పన చేయడం అందరు విద్యార్థులూ దానినే రాయడం శిరోధార్యమయ్యాయి.

మార్కులే గమ్యం.. లక్ష్యసాధన దుర్లభం..

ప్రామాణిక పరీక్ష ఏదైనా విద్యార్థికి వచ్చే మార్కుల ఆధారంగానే ప్రతిభను కొలుస్తుంది. ఏ స్థాయిలో, ఏ మేరకు మార్కులొస్తే ప్రతిభావంతుడిగా పరిగణించబడతారు? ఏ మేరకు తెచ్చుకున్నవారికి తదుపరి కోర్సుల్లో సీటు ఇవ్వవచ్చు? అనేది ఆధారంగా చేసుకొని విద్యార్థులు పరీక్షలకు సిద్ధమౌతున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా ఈ అంశాలను ఆధారంగా చేసుకునే విద్యార్థులను చదివిస్తున్నారు. విద్యార్థికి ఏం వస్తుంది? ఏం రాదు? సబ్జెక్టు ఎంతవరకు అర్థమైంది? ఏది అర్థంకాలేదు? అనేది అప్రస్తుతమై

పోయింది. దానితో సంబంధం లేకుండా సాధించాల్సిన లక్ష్యం నిర్ణయమైపోతున్నది. ఆ లక్ష్యాలను అందుకునే క్రమంలో విద్యార్థి తన శక్తిసామర్థ్యాలను లెక్కచేయకుండా శ్రమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు అలవోకగా లక్ష్యాన్ని అందుకొంటుంటే, మరికొందరు బాగా శ్రమించి ఆ లక్ష్యాన్ని చేరుతున్నారు. ఇంకొందరు విద్యార్థులు మాత్రం ఎంతగా తలమునకలైనా ఆశించిన లక్ష్యానికి చేరువ కాలేకపోతున్నారు. అంటే అఛీవ్‌మెంట్ గ్యాప్ పెరుగుతున్నది. ఈ అఛీవ్‌మెంట్ గ్యాప్ అనేదే ప్రధానంగా అందరిలోనూ ఆందోళనకు కారణమౌతున్నది.

భయాన్ని పారద్రోలాలంటే...

పరీక్షా ఫలితాలు ముఖ్యమనే మాట వాస్తవమే అయినప్పటికీ విద్యార్థులు విపరీతమైన ఒత్తిడి, భయాందోళనలకు గురయ్యేలా వుండకూడదు. అందుకే ఫలితాలను పదేపదే గుర్తుకు చేయడం మానాలి. విద్యా సంవత్సరం మొదటినుంచి చదివిన చదువును పరీక్షల ముందుండే కొద్ది కాలంలో ఎలా కన్సాలిడేట్ చేయాలనే దానిపై దృష్టి పెట్టేలా చూడాలి. అంటే పరీక్షలకు నిర్దేశింపబడిన పాఠాలెన్ని? పరీక్షా దృష్టితో నేర్చుకున్నవేమిటి? ఇంకా నేర్చుకోవాల్సినవి ఏమిటి? అనే విషయాలను విశ్లేషించుకునేలా ప్రోత్సహించాలి. ఇది వరకే బాగా నేర్చుకున్న వాటిని ఓవైపు రివిజన్ చేసుకుంటేనే ఇంకా నేర్చుకోవాల్సిన వాటిని పరీక్షల ముందు ఎలా నేర్చుకోవాలో టైంటేబుల్ రూపొందించుకునేలా చూడాలి. ఇక్కడే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ప్రధానమౌతుంది. విద్యార్థుల శక్తిసామర్థ్యాలను మరిచి అన్నీ నేర్చుకోవాలని, అన్నింటికీ సమాధానాలు రాయగలగాలని బలవంతం చేయడం వల్ల ఒత్తిడి చేయడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ.

దశను బట్టి సూచనలు

పరీక్షలు దగ్గరకొస్తున్నకొద్దీ పిల్లలకు ఇచ్చే సూచనలు కూడా మారాలి. పరీక్షలు 15 రోజుల ముందు వున్నప్పుడు పిల్లలకు ఎక్స్‌టర్నల్ పేపర్లను చేయించాలి. ఇప్పటివరకు చదువుచెప్పిన టీచర్ పరీక్ష పత్రం ఇచ్చేది. ఇప్పుడు బయటి వారు ఇస్తారు కాబట్టి విద్యార్థికి ఎక్స్‌టర్నల్ పేపర్లపై భయం వుంటుంది. ఆ భయాన్ని తొలగించడానికి మనం ఎక్స్‌టర్నల్ పేపర్లు ప్రాక్టీసు చేయించాలి. ప్రశ్నాపత్రం ఇచ్చిన వెంటనే పిల్లలు రాయడం మొదలుపెడ్తారు. అలాగాకుండా మొత్తం ప్రశ్నాపత్రం చదివే అలవాటు చేయాలి. ఇచ్చిన ప్రశ్నాపత్రాల్లో ఏ భాగం నుంచి ఎన్ని ప్రశ్నలు రాయాలి? ఆ భాగం నుంచి ఏఏ ప్రశ్నలను ఎంచుకోవాలి? అనే టెక్నిక్కులు నేర్పాలి. ప్రశ్నలను ఎంచుకున్న తర్వాత ఏ ప్రశ్నకు ఎన్ని అంశాలతో విశ్లేషణ చేయాలనేది విశ్లేషించడం నేర్పాలి. ప్రతి అంశాన్ని విపులీకరించి స్పష్టమైన ఒక హెడింగ్ పెట్టి సమాధానం రాసే అలవాటు చేయాలి. ఒక ప్రశ్నపై ఎక్కువ సమయం కేటాయించి, తర్వాత ప్రశ్నలపై తక్కువ సమయం కేటాయించడం కాకుండా పేపర్లను దిద్దేవారిని ఆకర్షించడం కోసం మొదటినుంచి చివరి వరకు ఒకేసరళిని అవలంభించాలి.

భయం లేని కాలంలో...

ప్రస్తుతం నా వయస్సు 84 సంవత్సరాలు. నేను 1937 నుండి 1945 వరకు హైస్కూల్‌లో చదువుకున్నాను. సర్కారీ స్కూళ్ళు తక్కువైనా పరీక్షలు మాత్రం చదువులో భాగంగానే వుండేవి. మాకు చెప్పిన చదువే పరీక్షించబడేది. చాలా వరకు సంవత్సరానికి రెండు, మూడు పరీక్షల కంటే ఎక్కువ వుండేవికావు. ఫస్టటర్మ్ ఎగ్జామ్ మాకు చదువు చెప్పిన టీచర్ యిచ్చేది కాబట్టి తరగతి గదిలో బాగా వింటే ఆ పరీక్షకు సరిపోయేది. కాబట్టి ఆ పరీక్ష అంటే భయం వుండేది కాదు. పరీక్ష సాయంత్రం కూడా మేం ఆడుకునేవాళ్లం. చెప్పిన పాఠాలను ఆ రాత్రి ఒక్కసారి చూసుకుంటే సరిపోయేది. మా తల్లిదండ్రులు చదువుకోలేదు కాబట్టి పరీక్షలకు మేం వెళ్తున్నామంటే పెండ్లికొడుకు తీరుగా పంపించేవాళ్లు. పరీక్షకు వెళ్ళేటప్పుడు ఏం రాస్తావో, రాసి వచ్చిన తర్వాత ఏం రాశావో అని అడగకపోయేవాళ్లు. సెకెండ్ టర్మ్ ఎగ్జామ్‌లో మాత్రం మాకు చెప్పిన టీచర్ కాకుండా అదే స్కూల్‌లో వేరే సెక్షన్ టీచర్ మాకు పేపర్ యిచ్చేది. కాబట్టి మాకు కొత్తదనం కనబడేది. దానివలన పరీక్షల్లో కొద్దిగా ఆలోచించేవాళ్ళం. కాబట్టి పరీక్ష పేపర్ కొంత ఆర్టిస్టిక్‌గా వుండేది. ఆ టీచర్ యొక్క ప్రతిభ దానిలో కన్పడేది. మేం బయటకు వచ్చిన తర్వాత మంచిగా అడిగారురా! పుస్తకంలో లేనిది అడిగారురా! అని చర్చించుకొనేవాళ్ళం. సంవత్సర పరీక్షలు మాత్రం పైతరగతి టీచర్లు యిచ్చేవారు. బహుశా మేం వెళ్ళే తరగతికి కావాల్సినటువంటి నైపుణ్యం మాకు వచ్చిందా? రాలేదా? అని తెలుసుకొనేవారు. మా తల్లిదండ్రులు కూడా పల్లెటూళ్ళలో వున్నవారు కాబట్టి సంవత్సర పరీక్షలు అయిన తర్వాత ఒకట్రెండు నెలలు మేం పల్లెటూళ్ళలో వారితో గడపటమే వాళ్ళ సంతోషం. అలాగే వాళ్ళతో మేం గడపటమే మాకు సంతోషంగా వుండేది. కాబట్టి మాపై చదువు ఒత్తిడి అంతగా వుండేది కాదు. ఆ సెలవుల్లో ఈతకొట్టడమో, చుట్టాల ఇండ్లకు తిరగడమో లేక సూర్యోదయం వరకు పండుకోవడమో చేసేవాళ్ళం. తల్లిదండ్రులు/ బంధువులు మమ్మల్ని పుట్టింటికి వచ్చిన ఆడపడుచు తీరుగా చూసుకొనేవాళ్ళు. దీనివల్ల మాపై చదువుకు స్ట్రెస్ తెలిసేదికాదు. 10వ తరగతిలో కూడా ఆడుతూ, పాడుతూ పరీక్షలు రాశాం. 10 వ తరగతి పూర్తయిన తర్వాత ఏం కావాలో మాకు తెలియకపోయేది. కాబట్టి మాకు ఆకాంక్షలు వుండకపోయేవి. మా అధ్యయనమే మాకు వరంలా మారింది.

కానీ ఈనాడు పరీక్షలు



ఒత్తిడి ఎక్కువైతే చేటు..

సమయం తక్కువగా వుండి, చదవాల్సిన అంశాలు ఎక్కువగా వున్నప్పుడు అన్నింటినీ నేర్చుకోవాలని ప్రయత్నించినప్పుడు ఒత్తిడి బాగా పెరుగుతుంది. అలా కలిగే ఒత్తిడివల్ల కనిపించే ఫలితాలు తాత్కాలికమే. అంటే ఎంతగానో ప్రయత్నించి చదివిన విషయాలు అప్పటికప్పుడు బాగానే గుర్తున్నట్లు అనిపించినా మళ్లీ మరచిపోవడం, పరీక్షల్లో సరిగా రాయలేకపోవడం జరుగుతుంది. తమకు గతంలోనూ ఇలా జరగడం చవిచూసిన విద్యార్థులు ప్రస్తుత ప్రిపరేషన్‌లో మరింతగా ఒత్తిడికి, భయానికి గురికావడం సహజం. దీనినుంచి విద్యార్థులను రక్షించాలంటే ఒకే ఒక మార్గం ... తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సముచితంగా మార్గదర్శకత్వం అందించడం. ఏది ఏమైనా సరే ఇన్నేసి మార్కులు సాధించాలని... ఈ ర్యాంకు రావాలని టార్గెట్లు పెట్టడం వల్ల నిద్రాహారాలు మాని విద్యార్థులు శ్రమించాల్సి వస్తుంది. శరీరానికి తగినంత నిద్ర విశ్రాంతి ఇస్తూ రోజూ గరిష్ఠంగా ఎన్ని గంటలు చదివే అవకాశం వుందో గుర్తించి, ఆ సమయంలో ఎన్ని పాఠాలు చదవగలరనేది వాస్తవికంగా ఒక అంచనాకు వచ్చేలా ప్రోత్సహించాలి. అన్నింటినీ పూర్తి చేయాలనే నిబంధన బదులు వాస్తవికంగా ఎన్ని చదవగలిగితే అన్ని చదవమని ప్రోత్సహించాలి. అనుకూల ప్రతికూలాంశాలను విశ్లేషించుకొని తమ తమ శక్తిసామర్థ్యాలకు తగ్గట్లుగా వాస్తవిక దృష్టితో ప్రణాళికలు రూపొందించుకొని చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఇవన్నీ చేస్తే చాలా వరకు ఒత్తిడి, భయం నుంచి వారిని బయటపడవేయవచ్చు.

పల్లెటూరి పిల్లలకు..

చదవడం వేరు పరీక్షాపత్రం రాయడం వేరు. ఈ విధమైన సాధన ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు, దళిత విద్యార్థులకు వుండదు. దాన్ని అధిగమించడానికోసం ఆ సూచనలు వున్నటువంటి ప్రతిభావంతులైన పిల్లల యొక్క జవాబుపత్రాలను అందరికీ సర్క్యులేట్ చేయాలి. 1) ఛాయిస్‌లో తీసుకోవడం (ఉపయోగించడం), 2) క్రమంగా ఇవ్వబడిన టైమ్‌లో రాయడం 3) అన్ని అంశాలు కవర్ అయ్యేటట్లు సమాధానం ఇవ్వడం. దీన్ని టీచర్లు సాధన చేయించాలి. పరీక్షలు పెట్టడం ఎంత ప్రధానమో ఆ పరీక్ష పేపర్లను దిద్దడం కూడా అంతే ప్రధానం. విద్యార్థులు చేసే పొరపాట్లను కూడా అధిగమించడమెలాగో నేర్పాలి. వారు రెండు రకాల తప్పులు చేస్తుంటారు. 1. సబ్జెక్టు అవగాహన లేకపోవడం వల్ల చేసే తప్పులు. 2. సబ్జెక్టు పూర్తిగాక పోవడం వల్ల చేసే తప్పులు. లేక సబ్జెక్టులో వుండే సున్నితమైన విషయాలు విశదీకరణలేకపోవచ్చు. దాన్ని మరలా క్లాస్‌లో చెప్పాలి. కొన్ని వ్యక్తిగతమైన మిస్టేక్స్ కావచ్చు. అటువంటి వాటిని విద్యార్థులను పక్కకు పిల్చి అవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించాలి. వ్యక్తిగతమైన లోపాలను తగ్గించవచ్చు. అలాగే మార్కులను ప్రశ్నాపత్రంపై వేయడం మానాలి. ఈ గ్రేడింగ్ పిల్లల్లో నిరాశ, నిస్పృహలకు దారితీస్తుంది. కనక ఉపాధ్యాయులు తన కోసం ఆ మార్కులను వేరే పేపర్లో రాసి పెట్టుకోవాలి. పరీక్షలు పెట్టడం ఎంత ప్రధానమో ఫాలో ఆఫ్ యాక్షన్ కూడా అంతే ప్రధానం. దాన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లల్ని రాత్రిపూట చదివించేటప్పుడు ఉపాధ్యాయులు/తల్లిదండ్రులు ఆ విషయాలను పిల్లలు చదివేట్లు చూసుకోవాలి. ముఖ్యంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో వుండే పిల్లలతో ఆ జాగ్రత్త వహించాలి.



మారాయి. పదో తరగతి వరకు పరీక్షే లేకపోవడం, ఆ పదో తరగతికి వచ్చిన తర్వాత మాత్రమే ప్రతి ఆదివారం పరీక్షలు పెట్టడం, ఆ పరీక్ష మార్కులను తల్లిదండ్రులు అడగడం, ఉపాధ్యాయులు ఆ పరీక్షకు కావాల్సిన నోట్స్ యివ్వడం, పరీక్ష పత్రాలు కూడా ఒక మూసలో పోసినట్లు రావడం, ఆ మూసలో విద్యార్థులను తయారు చేయడం, ఆ మార్కుల్ని ఇతరులతో పోల్చడం, యివన్నీ కూడా నేటి విద్యార్థులకు మేం అనుభవించినటువంటి పరిస్థితులకు భిన్నంగా వున్నాయి. కాబట్టే ఈనాడు పరీక్షలే చదువును నియంత్రిస్తున్నాయి. పదో తరగతికి వచ్చే వరకు విద్యార్థి యొక్క చదువును పట్టించుకోకపోవడం, 10వ తరగతికి రాగానే కసిదీరా పరీక్షలు పెట్టడం, దానిపై ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని , విద్యార్థుల సామర్థ్యాన్ని కొలమానం చేయడం - ఉభయులకు కూడా భారంగా మారింది. పరీక్ష పేపర్లో ఏమన్నా కొత్తదనం వున్నదా? అంటే మీకు చెప్పిన తరగతి గది చదువుకు సంబంధమే వుండదు. స్కూళ్ళన్నీ వేరైనా అందరికీ ఒకటే పేపర్ కాబట్టి ఈనాటి పరీక్షలు కేంద్రీకరణ. ఆనాటి పరీక్షలు వికేంద్రీకరణ. కాబట్టి ఆ పేపర్లు తెలవకపోవడం వల్ల సైంటిఫిక్‌గా కనబడ్డాయి. ఈనాడు పేపర్లు తెలిసి కూడా అన్‌సైంటిఫిక్‌గా కనబడుతున్నాయి.

పరీక్షలు ఎప్పుడొచ్చాయి?

పరీక్షలు అనే పద్ధతి పరాయి పాలనతో మొదలైంది. పరాయి పాలన వచ్చిన తర్వాత టెక్స్‌బుక్ అమలులోకి వచ్చింది. దానికన్నా ముందు విద్యార్థికి ఏం చెప్పాలో? ఎలా చెప్పాలో ఆ టీచర్ యొక్క నిర్ణయంగా వుండేది. కానీ ఏకస్వామ్య ప్రభుత్వాలు వచ్చిన తర్వాత ప్రజలను ఒక మూసలో పోసి రెజిమెంటేషన్‌కు అనగా ప్రభుభక్తి, పాలకులపట్ల విధేయత, తాము అనుకున్న (ఆశిస్తున్న) సమాజంగా రాబోయే సమాజాన్ని తయారుచేయడమే విద్య యొక్క లక్ష్యంగా పరిగణించి అలాంటి సమాచారమే ప్రజలకు యివ్వడం ఆ టెక్స్‌బుక్స్ లక్ష్యంగా వుండేది. ఆ బుక్స్‌లో విషయమే ఉపాధ్యాయుడు క్లాస్‌లో చెప్పాడా? చెప్పలేదా? అని నమ్మకం లేక అజమాయిషీ (ఇన్‌స్పెక్షన్) మొదలైంది. ఆ ఇన్ఫర్మేషన్ పిల్లలకు వచ్చిందా? రాలేదా?, దానికన్నా యింకా అదే లక్ష్యంగా వచ్చిందా? రాలేదా అని కనుక్కోవడానికి ఎక్స్‌టర్నల్ పరీక్ష మొదలైంది. పరాయి పాలనలో ఉపాధ్యాయుల మీద నమ్మకం లేక పరీక్ష మొదలైంది. కాబట్టి ఆ పరీక్షకు ఇన్ఫర్మేషన్ ప్రధానం. ఆ ఇన్ఫర్మేషన్ వున్నది వున్నట్లు ఎవరు చెబితే వాడే మేధావి (ఇన్ఫర్మేషన్ ఓరియంటెడ్ ఎగ్జామ్‌లో). అయినా ఆనాడు



ఉపాధ్యాయులు తన బోధనతో ఆ పాఠ్యాంశాలను సమాజంతో అన్వయించుకొని దేశభక్తిని, జాతీయతను రంగరించి పూశారు. కాబట్టి అవి పరీక్ష భాగం కాకున్నా ఉపాధ్యాయుని యొక్క జీవితమే, అతని బోధనే ఆనాటి జాతీయతకు తోడ్పడింది. పరీక్ష ప్రభుత్వ సర్టిఫికేట్ కోసం. బోధన జాతీయత కోసం, సమాజం కోసం.

కార్పొరేటీకరణ

ఈనాడు ఏ రాష్ట్రంలోనూ లేనటువంటి ప్యాటర్న్ మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన వ్యక్తి పి.వి. నరసింహారావు. ఆయన దూరదృష్టితో రాబోయే రోజుల్లో దేశ అవసరాన్ని గుర్తించి 11, 12 తరగతుల్లో పిల్లల విద్యా ప్రమాణాల్ని పెంచడానికి సబ్జెక్టుల్లో కాంపిటెన్సీ గల ఉపాధ్యాయ వర్గాన్ని నియమించారు. పరీక్షా విధానం కూడా ఉన్నత విద్యకు ఉపయోగపడేవిధంగా పరీక్షా పేపర్‌ను రూపొందించారు. దానికై ఒక ప్రత్యేక బోర్డును కూడా ఏర్పాటు చేయించాడు. కానీ కాలక్రమేణా మార్కెట్ శక్తుల ప్రభావం వల్ల అది ప్రయివేటైజేషన్‌కు దారితీసి, కార్పొరేటైజేషన్‌కు దారితీసింది. ఈనాడు రాష్ట్రంలో ఇంటర్ విద్యలో ప్రతిసంవత్సరం 10 లక్షలమంది విద్యార్థులు కూర్చుంటున్నారు. కానీ సైన్స్ గ్రూప్‌లో మాత్రం కేవలం రెండు లక్షల మంది కంటే మించిలేరు. ఈ రెండు లక్షల మంది దాదాపుగా సంపన్నవర్గాల నుంచి వచ్చినవారు. కాబట్టి వీరంతా కూడా కార్పొరేట్ కాలేజీల్లో చదవడం, కార్పొరేట్ చదువు యొక్క విధానమే మొత్తం ఇంటర్ విద్యను డామినేట్ చేస్తున్నది. చివరకు ప్రభుత్వం కూడా ఇంటర్ విద్యను, బోర్డును కార్పొరేట్ వాళ్ళ చేతిలో పెట్టింది. కాబట్టి పరీక్షా విధానం కూడా వారి ప్రయోజనాలు కాపాడేవిధంగానే వుంటున్నది. అనగా క్వశ్చన్ బ్యాంక్‌లు తయారుచేయడం, ప్రాక్టికల్స్ ఇంటర్‌లో చేయకుండానే మార్కులు వేయడం, వాల్యుయేషన్ వారి నీడలోనే జరగడం కార్పొరేట్ ప్రయోజనాలే ప్రభుత్వ నిర్వహణ విధానం అయిపోయింది. దీనివల్ల వాల్యుయేషన్‌లో కార్పొరేట్‌వారి యొక్క ప్రయోజనాలను కాపాడేవిధంగానే పరీక్షల నిర్వహణ జరుగుతున్నది.

చిట్కాలకే పెద్దపీట

బోధనపై కూడా దీని ప్రభావం పడింది. సబ్జెక్ట్

చెప్పే వాడికి గిరాకీ తక్కువ కావడం, చిట్కాల పద్ధతే చదువు చెప్పే పద్ధతిగా మారడం వలన పరీక్షలే బోధనా పద్ధతిని శాసించే స్థితికి వచ్చాయి. ఎవడికి చిట్కాలు వస్తాయో వాడికే గిరాకీ ఏర్పడింది. దీనివల్ల టీచర్స్ సబ్జెక్ట్ మర్చిపోయి చిట్కాలు నేర్చుకోవడం మొదలుపెట్టారు. దీని ప్రభావం వల్ల కార్పొరేట్ పంట పండింది. ప్రశ్నల సంఖ్య తక్కువైంది. క్వశ్చన్‌బ్యాంకు వలన ప్రాక్టీస్ చేయడానికై ఉదయం 7 గం॥ల నుండి రాత్రి 9గం॥ల వరకు కాలేజీలు మొదలయ్యాయి. అవే రెసిడెన్షియల్ కోచింగ్ సెంటర్లకు అవకాశమిచ్చాయి. చివరకు పిల్లలకు ఆన్సర్లను బట్టీపెట్టించడమే బోధనా పద్ధతిగా మారింది. కాబట్టి సబ్జెక్టు రాకుండా ఎంసెట్‌లో మార్కులు సంపాదించే ఉపాయాలు అందరికీ వచ్చాయి. దీనివల్ల ఇంజనీరింగ్‌లో ఫస్ట్ ఇయర్‌లోనే పిల్లలు ఫెయిల్ అవడం మొదలుపెట్టారు. ఎంసెట్‌లో ర్యాంకు వున్న వారు కూడా ఫస్ట్ ఇయర్‌లోనే ఫెయిల్ కావడం కొంత ఆశ్చర్యం కల్గించింది. కాబట్టి ఇంటర్ మార్కులకు కూడా కొంత వెయిటేజీ యివ్వాలనే ఆందోళన మొదలైంది. దీనివలన దయారత్నం కమిటీ వచ్చింది. ఇంటర్ యొక్క చదువును కూడా కార్పొరేట్‌రంగం చేతిలోకి మళ్ళించారు. దీన్నే త్రీ ఇన్ వన్ అంటారు. అనగా ఒకటే ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్, ఎంసెట్, ఐ.ఐ.టీ. చదువు మొదలైంది. పిల్లవాని యొక్క ఆర్థిక స్తోమతను బట్టి ఒక్కో స్ట్రీమ్‌కు ఒక్కోరకమైన రేట్లు మొదలయ్యాయి. ఒన్ ఇన్ ఒన్, ఒన్ ఇన్ టూ, వన్ ఇన్ త్రీ అని అంటారు. అనగా వాల్యుయేషన్ కార్పొరేట్ రంగానికి ఇంధనంగా మారి ఆ రంగానికి ఆజ్యం పోసింది. కాబట్టి వాల్యుయేషన్ పరీక్షలనే కాకుండా మొత్తం విద్యావిధానాన్నే నియంత్రించే స్థాయికి ఎదిగింది. ఈ పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ మంటకు గాలి ఊదింది. ఈ మంటలో పిల్లలు ఆహుతయ్యారు. తల్లిదండ్రులు ప్రేక్షకులుగానే కాదు, భజనపరులుగా మారారు. ఇదే మన ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ విద్యా విధానానికి మూడు పూవులు, ఆరు కాయలుగా మారింది.

వాల్యుయేషన్

పరీక్ష నిర్వహణ ఎంత ప్రధానమో, పరీక్ష పేపర్లను దిద్దడం, రిజల్టు యివ్వడం కూడా అంతే ప్రధానం- అంతేమార్పుకు కూడా గురైంది. మేం చదువుకునే రోజులైనా, లేక ఉపాధ్యాయులుగా పనిచేసే రోజుల్లో అయినా 1975 వరకు జవాబు పత్రాలను (ఆన్సర్ స్క్రిప్ట్) ఉపాధ్యాయుల ఇళ్ళకు పోస్టు ద్వారా పంపించేది. 1972లో ఇంజనీరింగ్‌లో వచ్చిన బూమ్ వలన ఇంటర్ మార్కులనే ఆధారం చేసుకొని ఇంజనీరింగ్ సీటు యిచ్చేది. ఆ పరీక్ష అధికార్లపై ఒకవైపు తల్లిదండ్రుల వత్తిడి, మరోవైపు ఆఫీసర్ల ఒత్తిడి ఎక్కువగా వుండటం వలన "స్పాట్ వాల్యుయేషన్"ను ప్రతిపాదించారు. స్పాట్ వాల్యుయేషన్ వలన ఎగ్జామినర్స్ అందరూ కూడా ఒకే ప్రదేశంలో దొరకడం వత్తిడి తెచ్చేదానికి సులభమైంది.

వ రా ం ం క ల ం వేయించుకోవడం, దాంతో ఇంజినీరింగ్, మెడిసిన్‌లలో సీటు సంపాదించుకోవడం సులభమైంది. దాంతోసహా విద్యారంగంలో ఏర్పడిన వ్యాపార ధోరణులు ఈ ప్రాక్టీస్‌ను వేగవంతం చేశాయి. అదే ఎంట్రన్స్ పరీక్షకు మూల కారణమైంది. ఎంట్రన్స్ పరీక్షలో ఆనాడు 200 ప్రశ్నలు అడిగేవారు. ఎవరూ కూడా నియమిత కాలంలో పేపర్ పూర్తిచేసే అవకాశం లేకుండేది. కాబట్టి ఆ ప్రశ్నాపత్రాన్ని ఎంత తెలివైన విద్యార్థి అయినా పూర్తిచేయలేకపోయేవాడు. ప్రశ్నలు తక్కువ చేయాలనే ఆందోళనకూడా మొదలైంది. ప్రశ్నలు ఇంటర్ పుస్తకం నుంచే వుండాలని కూడా కోర్టుద్వారా సంపాదించుకున్న సౌలభ్యం ఒకటి. దీంతోసహా ఎంసెట్ యొక్క ఫలితాలపైనే కార్పొరేట్ రంగాల ఉనికికి అవకాశం ఏర్పడటం వలన ఆ క్వశ్చన్స్ యొక్క స్వచ్ఛతపైన, క్వశ్చన్‌పేపర్ ప్యాటర్న్‌పైన మార్కెట్ శక్తులు ఒత్తిడి తీసుకొచ్చాయి. దీనివలన క్వశ్చన్‌బ్యాంకు తెలుసుకోవడం, ఆ ప్రశ్నలు కూడా ఇంటర్ పుస్తకం నుండే వుండటం కార్పొరేట్ రంగం యొక్క పనికి సులభతరమైంది. క్వశ్చన్‌బ్యాంక్‌ను కార్పొరేట్ యాజమాన్యాలు ప్రాక్టీస్ చేయించడం, ఆ ప్రశ్నలు తక్కువ స్టెప్స్‌తో ఆన్సర్‌లు తెచ్చుకొనే పద్ధతి కూడా అమలులోకి వచ్చింది కాబట్టి ఇంటర్ సిలబస్ చెప్పడానికి బదులుగా ఆబ్జెక్టివ్ టైప్ క్వశ్చన్‌లు చెప్పడమే బోధనగా మారింది. అదికూడా చిట్కాల పద్ధతిలో చెప్పడంగా అంటే ఆన్సర్స్‌ను తక్కువ స్టెప్స్‌లో చెప్పడం ఒకటి, ప్రాక్టీస్ చేయించడం రెండవది. ఈ రెండు కూడా కార్పొరేట్ సొత్తయ్యాయి.

టీచర్లు వాల్యుయేషన్‌ను శాస్త్రీయంగా వుందని భావించడంలేదు. తమను నమ్మడంలేదనే భావనే వారిలో వున్నది. ఈ వ్యవస్థలో డైరెక్టర్ డి.ఇ.ఓ.ను విశ్వసించడు. డి.ఇ.ఓ. ప్రధానోపాధ్యాయుడ్ని విశ్వసించడు, ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయుడ్ని విశ్వసించడు, ఉపాధ్యాయుడు విద్యార్థిని విశ్వసించడు కాబట్టే జంబ్లింగ్ అని, ఎప్పటికప్పుడు రకరకాలైన కొత్త పద్ధతులతో పరీక్షలు పెట్టే పాలసీ వచ్చింది. ఇక తమ పిల్లలకు సీటు దొరికితే చాలు అన్నట్లుగా వారి తల్లిదండ్రుల భావన వుంది. కనుక ఇప్పుడు పరీక్షలు రాసే విద్యార్థులకు తగు సహాయం అందించి నిర్భీతంగా వుండే వాతావరణం కల్పించడం తక్షణ సమస్య. పరీక్షా విధానాన్ని శాస్త్రీయంగా ప్రక్షాళన చేయడం దీర్ఘకాలిక సమస్య. ఆ దిశలో అందరూ ఆలోచించాలి.

★

విదేశాల్లో పరీక్షలు

ఇతర దేశాల్లో ఒకేపరీక్షను ఆధారం చేసుకొని ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ యిచ్చే పద్ధతి లేదు. ఇంజనీరింగ్ సీటు అయినా లేక ప్రొఫెషనల్ కోర్సులలో అయినా సీటు యివ్వడానికి నాలుగైదు పారామీటర్లు వుంటాయి. మొదటిది స్టడీ సర్టిఫికేట్ - ఆ స్టడీ సర్టిఫికేట్ కూడా ఒక పరీక్షతో కాదు - కంటిన్యువస్ ఎవాల్యుయేషన్ జరుగుతుంది. దాన్నే స్టడీ సర్టిఫికేట్‌గా తీసుకుంటారు. అదీగాక ఏ టీచర్ దగ్గరైతే చదువుకున్నాడో ఆ టీచర్ నుండి ఇద్దరి పేర్లు సూచించాలని అడుగుతారు. వారితో అడ్మిషన్ కమిటీ వాళ్ళు డైరెక్టుగా సర్టిఫికేట్ యొక్క పెర్ఫార్మెన్స్ ఏ విధంగా వుందో అని రిపోర్టు అడుగుతారు. ఇదేగాక అతను ఈ పరీక్ష కన్నా ముందు రెండు సంవత్సరాల ముందు నుండి టెక్స్టుబుక్స్ కాకుండా వేరే పుస్తకాలు ఏం చదివారో లిస్ట్ యివ్వమంటారు. ఈ పుస్తకాలనుండి ఏ రెండు పుస్తకాలనో తీసుకొని వాటిపై ఆ క్యాండిడేట్‌ను ఇంటర్వ్యూ చేస్తారు. ఇదేకాకుండా కనీసం రెండు ఆటల్లో (ఇండోర్ గేమ్, ఔట్ డోర్ గేమ్)లో అతని యొక్క ప్రావీణ్యత చూస్తారు. వీటన్నింటి యొక్క అగ్రిగేట్ తీసుకొని అతన్ని సెలక్ట్ చేస్తారు. సోషలిస్టు దేశాలైతే అంటే క్యూబా, చైనా దేశాల్లో అయితే అతని యొక్క సోషల్ బ్యాక్‌గ్రౌండ్ కూడా చూస్తారు. కాబట్టి మన అడ్మిషన్ పాలసీ ఇటు ఒక వలసవాద దేశాలది కానీ, అటు క్యాపిటల్ దేశాల తీరుగా కానీ లేదు. మరియు సోషలిస్టు దేశాల మాదిరిగా కూడా లేదు. లిబరల్ దేశాల మాదిరిగానూ లేదు.

కథ



ఐదు పాలిచ్చే జంతువులు

ముళ్లపూడి వెంకటరమణ సృష్టించిన పాత్రలన్నింటిలోనూ (అప్పారావు, రెండుజెళ్ల సీత, రాధ- గోపాలం, తీ.తా, కాంట్రాక్టర్...) ప్రసిద్ధి చెందింది బుడుగు. 1956 - 57 వరకు సీరియల్‌గా వెలువడి తెలుగు పాఠకుల మనసు దోచుకుంది. తర్వాత ముళ్లపూడి సాహితీ సర్వస్వం మూడవ సంపుటంగా వెలువడింది. ఇటీవలే మనందరినీ శాశ్వతంగా విడిచి వెళ్లిపోయిన ముళ్లపూడి వారి స్మృత్యర్థం 'బుడుగు'లోని ఓ శకలం మీకోసం.

నాన్న ఓసారి ప్రైవేటు చెప్పాడు. ఇది నిజం ప్రైవేటులే. యెప్పుడేనా చెప్తాడుగదా. ఏంరా బుడుగూ మనకి పాలిచ్చే జెంతువులు అయిదు చెప్పరా అన్నాడు.

హె ఇంత తెలీదనుకున్నావా అనేసి నేను చెప్పేశాను. కాని తప్పంటాడే.

నేనేం చెప్పానంటే, ముందస్తుగా ఆవు, గేదీ, చెప్పాను. తరువాత, చిట్టీ వాళ్ళు పట్టుకుని తాడుకి కడతారే - అదేమిటి? మేక.....మేక అని ఇంకోటి చెప్పాను.

ఆ తర్వాత రెండు ఆవులు అని చెప్పాను.

నాన్నా అమ్మా కూడా నవ్వేశారు. ఆవు ముందరే చెప్పావుగా ఇంకో రెండు కొత్తవి చెప్పాలి అన్నాడు నాన్న.

ఇంక లేవు ఫో అన్నాను నేను.

పోనీ మీరు చెప్పండి అంది అమ్మ (అమ్మలు నాన్నల్ని మీరు అంటారులే చాలామంది)

నాన్న కుంచెంసేపు బుర్ర గోక్కుని గొర్రి అన్నాడు

మర్రేనండోయ్ అంది అమ్మ. అనేసి ఊరుకుంది.

మరి ఇంకోటో? ఇంకో వేలుందిగా అన్నాను నేను.

నాన్న ఏడిసావు అని నన్ను కోప్పడేశాడు.

అంటే ఇంకో వేలుకి యేంచెప్పాలో తెలీదన్నమాట.

ఇలా అని అమ్మ అనేసింది కూడా. అనేసి నవ్వేసింది.

అప్పుడు నాన్న గబగబా బుర్ర గోక్కుని తెలీకేం బోల్డున్నాయి. జిరాఫీ, పులి, పిల్లి, కుక్క అన్నాడు.

అవన్నీ మనకు పాలిస్తాయా యేమిటి అంది అమ్మ ఇంకా నవ్వుతూ.

అపుడు నాకూ నవ్వొచ్చేసింది. నాన్నకీ నవ్వొచ్చేసింది. అందరికీ నవ్వొచ్చేసింది.

కుక్కంటే ఇంకోటి గ్నాపకం వస్తోంది.

ఆ లావుపాటి పిన్నిగారి మొగుడుగారు లేరూ? వాడేమో ఓసారి రోడ్డుమీంచి వెళ్తున్నాడు.

కాదు ముందస్తుగా ఓ కుక్క వచ్చింది. నేను దాన్ని మా యింట్లోకి రమ్మన్నాను పెంచుకుందామని.

అది రానంది. నేను తోక పట్టుకుని రమ్మన్నాను.

అప్పుడు వీధిలో వెళ్తున్న లావుపాటి పక్కింటి పిన్నిగారు ముగుడుగారు వచ్చారు. పిన్నిగారు కాదు, ముగుడు అన్నమాట.

వురేయ్ బుడుగూ అలా తోకని లాగకూ కరుస్తుంది సుమీ అన్నాడు - ఇలా బయంగా చూసి.

ఇంకెలా వీళ్ళతోటి, తోకెక్కడేనా కరుస్తుందా. తోకని లాగితే అప్పుడు కుక్కకి నెప్పి పెట్టితే మన్ని నోరుతో కరుస్తుందన్నమాట.

అలాగే మనకి జెటకా కొనుక్కోవాలని ఉందనుకో, నాన్నతో చెప్తే నాన్నంతట నాన్న కొనడు గదా. పోనీ దేముడిని అడిగితే వాడంతట వాడు ఇలా వచ్చేసి ఇదుగో బడుగూ డబ్బులిందా, జెటకాబండీ కొని ఇంఛక్కా తోలుకో అంటాడా?

మరి అనడుగదా. మరి ఎలాగా? అందుకే మనకి మూడు చెక్రాల సైకిలు కావాలనుకో. దేముడి దగ్గర నించుని చేతిలో వెన్నముద్ద చెంగల్వ పూదండ అని ముందస్తుగా పజ్జెం చదవాలి. ఆనక, ఓ దేముడూ నాకు జెటకా బండీ, కొరడా కొని పెట్టాలమ్మా అని కళ్ళు మూసుకుని గట్టిగా చెప్పాలి.

అప్పుడేమో మా బామ్మ వింటుంది. అమ్మ వింటే లాభం లేదనుకో.

అమ్మ వింటే నవ్వేసి, బుగ్గమీద గిల్లేసి, మహా అయితే ముద్దు పెట్టుకుని వెళ్ళిపోతుంది.

నాన్నకి వినపడినా లాభం లేదనుకో.

అందుకని బామ్మకి వినేలా చెప్పు దేముడికి. బామ్మకి మరి కుంచెం చెముడుకదా. అందుకని దేముడికి మరి కుంచెం గట్టిగా చెప్పాలి అందుకు.

నేను అలా చేస్తే బామ్మ నాకు ఓసారి బొంగరం, రెండుసార్లు గోళీకాయలూ కొనిచ్చింది.

నా దగ్గర గోళీకాయలూ చాలా లేవు. ఓ ప్పది కూడా లేవు. ఎదురుగుండా ఉన్న ఇంటిలో కుర్రాడి దగ్గర ప్పది ఉన్నాయి.

అంటే వాళ్ళ బామ్మ ప్పది గోళీకాయలు కొని పెట్టింది అని కాదు. వాడు నా దగ్గర గోళీలు రెండు కొరేశాడు. నిన్నో రేపో, ఇలాగే ఇంకోడి దగ్గర బెల్లించి, దబాయించి లాక్కున్నాడు. అందుకే.

బెల్లించడం అంటే, నువ్వు బంగారు తండ్రికదమ్మా, నువ్వు బాచాలకొండవి కదమ్మా అనేసి మనదగ్గర బొమ్మలూ, జంతికలూ, గోళీలూ, నా వుండీలో వుండే డబ్బులూ అవన్నీ లాక్కోడం అన్నమాట.

మనం ఇవ్వను అంటాం అనుకో - అప్పుడు ఘటిక్కున బోడివేధవా అని తిట్టడం.

అప్పుడు కూడా ఇవ్వకపోతే అల్లదుగో కాకి అటుచూడు అనేసి, మనం అటు చూస్తూ వుంటే, తీసేసుకుంటారు.

దీన్ని టోకరా అంటారని బాబాయి చెప్పాడు. టోకరా అంటే కూడా అబద్ధం చెప్పడమే. అంటే, ఇప్పుడు నా దగ్గర వుండి వుంది కదా, అందులో డబ్బులు వుంటాయి కదా, డబ్బులుంటే వుండీ బరువుగా ఉంటుంది. లేకపోతే తేలికగా ఉంటుంది. చప్పుడు అవదు. ఒక్కోసారి కుంచెం కాణీలు వుంటే, చప్పుడు అయినా, బళువుగా వుండదుగదా.

నా వుండీ వుండుండీ తేలికగా అయిపోతుంది. అది ఎప్పుడంటే నాన్నకి జీతం రానప్పుడు అన్నమాట. అప్పుడు మనం ఎందుకు వుండీ తేలికగా వుండీ

అంటా మనుకో.

ఏమో అంటుంది అమ్మ, నాన్న కూడా ఏమో అంటాడు, హాచ్చెర్య పడిపోయేస్తూను. కాని బాబాయి నిజెం చెప్తాడు. కొంచెం రోజులు అయ్యాకా అనుక్కో.

ఏమిటంటే, నాన్న దగ్గర డబ్బులు అయిపోతే, నేను నిద్దరపోయినప్పుడేమో, నా వుండీలలో డబ్బులు అప్పు తీసుకుంటారుట. మళ్ళీ డబ్బులొచ్చాక అందులో ఆ అప్పులు వేసేస్తారుట. అప్పుడు వుండీ మళ్ళీ బళువుగా ఉంటుంది.



ఏం? మరి బాబాయి ఇలా అని నాకు ముందస్తుగా ఎందుకు చెప్పడు? ఆలీసెంగా చెప్తాడు గదా. ఇలా ఆలీసెంగా నిజం చెప్పినా అబద్ధమే అన్నమాట.

ఇలాంటి నిజెం ఎప్పుడేనా పెద్దవాళ్ళే చెప్తారు. చిన్నపిల్లలు ఆలీసెంగా నిజం చెప్పకూడదట, చెప్తే డేంజరు.

డేంజరు అంటే, పిన్నిగారూ మా బామ్మా పోట్టాడుకోడం.

ఇప్పుడు పిన్నిగారుందికదా, ఆవిడకు పేద్ద జడలేదు కదా. అని నవ్వింది.

అప్పుడు నాకు ఖోపం వచ్చింది. అమ్మని ఎందుకలా అనాలి అని. నిజెం చెప్పెయ్యాలని నిల్చున్నాను. పిన్నిగారు ఎంతసేపయినా నిజం చెప్పడం లేదు. ఇంక ఆలీసెం అయిపోతుంది. మరి నేను ఒక్కోసారి చిన్న వెధవని గదా. అందుకని ఆలీసెంగా నిజెం చెప్పకూడదు.

అందుకని కొయ్ కొయ్ అన్నాను పిన్నిగార్ని చూసి.

అప్పుడు పిన్నిగారు నోర్ముయ్ అంది.

అప్పుడు నేను నీది నిఝెం జెడకాదు. సవరం జెడలే అన్నాను. అప్పుడు పిన్నిగారు నోర్ముయ్ అంది. అమ్మ నా నోర్మూసేసింది. కాని బామ్మ మంచిది గదా.

బామ్మ పోట్టాడింది పిన్నిగారితోటి అమ్మతోటి. చిన్న వెధవని అలా గసుర్తారేమిటమ్మా అంటూను.

అసలు పిన్నిగారికి నేనంటే కోపం. కోపం అంటే భయం. నేను ఎప్పుడేనా వాళ్ళింటికెళ్తే తలుపేసేస్తుంది. నేను తలుపులోంచి వెళ్ళనుగా. కిటికీలోంచి వెళ్తాననుకో.

అప్పుడు చంపేస్తా అంటుంది నన్ను ఇలా చూసి.

ఏడిశావులే అనేసి నేను పారిపోతా. మళ్ళా నన్ను పట్టుకోలేక, వాళ్ళ ముగుడితో చెప్పుకుంటుంది. వాడికి నేనంటే భయంలే. నేను కనబడితే, ఇలా నవేసి ఓ కాణీ ఇచ్చేస్తాడు.

నేనంటే చాలా మందికీ బయంట. మరి నేను మంచివాణ్ణి. ఎందుకనో.

అంతెందుకు, మా నాన్నకీ, మా నాన్న ఆఫీసులో పనిచేసే వాళ్ళందరికీ నేనంటే బయమేగదా. వాళ్ళ మేనేజరు లేడూ, వాణ్ణి మా నాన్న వాళ్ళూ సాయంత్రం తిట్టుతారు గదా. అపుడు వాడుండడనుకో అక్కడ.

విగ్గులేని ఎముడు అని వాడికి పేరు. పెద్దమీసాలూ అవ్వీ ఉంటాయిగాని, నిఝెం ఎముడిలా ఉండడు. నేను ఎముడిని చూశానులే – ఓ సినిమాలో.

బాగా లావుగా వుంటాడు. మీసాలు వాడూను. వాడికి గిరజాల విగ్గు ఉంటుందన్నమాట. పిన్నిగారి సవరం లాగ.

యేం? ఒకరోజున నాన్న ఆఫీసుకు తీసుకెళ్ళలేదూ. ఆ వేళ ఈ ఆఫీసులో ఎముడు ఎలా ఉంటాడో చూద్దాం నాన్నా అన్నాను.

ఏడిశావు ఒద్దు అన్నాడు నాన్న.

కాని మరి చూడకపోతే ఎలా? అందుకని, ఆఫీసులో నాన్న చూడకుండా నేనే వెళ్ళాను. ఓ గదిలో కూచున్నాడు వాడు. వాణ్ణి చూస్తే అస్సలు ఎముడిలా లేడు. భయం వెయ్యలేదు.

వాడు నన్ను చూసి పిల్చాడు నవ్వుతూ, తరువాత బిస్కెట్టు పెట్టాడు.

అప్పుడు ఎముడంటే వీడు కాడు అనుకున్నాను. అందుకని వాడినే అడిగాను.

ఇక్కడ విగ్గులేని ఎముడు అని ఒడున్నాడట. ఎవడురా వాడు అన్నాను.

నేనేలే అన్నాడు వాడు నవ్వుతూ.

కొయ్, కొయ్, నువ్వు కావు. మా నాన్న, ఇక్కడ సుబ్బారావు గాడూ ఇంకో తలపాగా వాడూ వాళ్ళంతా ఇక్కడ నిఝెం ఎముడున్నాడని చెప్పారే. అన్నాడు.

నేను మేనేజర్ని. అందుకని నేనే ఎముడుని అన్నాడు వాడు.

విగ్గులేని ఎముడంటే కూడా నువ్వేనా అన్నాను.

నాకు విగ్గు లేదుగా అన్నాడు వాడు.

ఎందుకు లేదు అన్నాను. నాకు బలే జాలేసింది. ఎముడికి విగ్గు లేకపోతే ఎలా మరి. మా పక్కింటి పిన్నిగారి సవరం తెచ్చి పెట్టనా అన్నాను.

ఒద్దులే అన్నాడు వాడు.

నువ్వేనా మా నాన్నా వాళ్ళ ప్రాణాలను తోడేస్తున్నావుట అన్నాను నేను.

మీ నాన్నా వాళ్ళూ ప్రాణాలు అస్సలు పట్రారులే. తెచ్చినా గుప్పిట్లో పెట్టుకుంటారు అన్నాడు వాడు.

అప్పుడు నాకు అనుమానం వేసింది. వీడు నిజెం ఎముడు కాదురా అని.

అందుకని తలుపు దగ్గరకెళ్ళి, మా నాన్నని గారిగా పిలిచి అడిగాను. నాన్నా వీడేనా విగ్గులేని ఎముడు అని.

అంతే. ఒకసారి నాన్నా వాళ్ళందరూ పరుగెరుకొచ్చేసి నా నోరు మూసేశారు.

వెధవా ఏమిటా వాగుడు అన్నారు. అంతట్లోకి ఎముడు కూడా వచ్చేశాడు తలుపు దగ్గరికి.

మా నాన్న హడ్డిలి పోయాడు వాణ్ణి చూసి.

హేదో కుర్ర వెధవండి. వాడికి తెలీదు అన్నాడు నాన్న.

మరే అన్నాడు ఎముడు.

కాదు! తెలుసు. నేను పెద్ద వెదవనే అన్నాను నేను.

ఔను అన్నాడు ఎముడు.

సార్ సార్ వాడి మాట వినకండి అన్నాడు నాన్న.

ఏం వాడు పెద్దవాడని ఒప్పుకుంటే తప్పా అన్నాడు ఎముడు.

అది కాదండి. మీ సంగతి అన్నాడు సుబ్బారావు గారు.

నా సంగతేమిటి అన్నాడు ఎముడు.

మీరు విగ్గులేని ఎముడని ఈ కుర్రాడన్నాడు చూడండీ....అది పెద్దవాళ్ళమాట విని కాదు అన్నాడు తలపాగా ఆయన.

మరే మరే. వాడికే తట్టి ఉంటుంది. మా వాడు రౌడీవెధవ అన్నాడు నాన్న.

నిజమే. అందుకే ఈ పిల్లాడు విగ్గు కొనిపెడతానన్నాడు ఎముడు.

విగ్గిచ్చినా నువ్వు ఎముడిలా ఉండవు అన్నాను నేను.

మరేండి ఉండరు ఉండరు అన్నారు నాన్నా, తలపాగా వాడూను.

రైటే విగ్గుంటే విగ్గులేని ఎముడిలా ఎలా ఉంటాను అన్నాడు ఎముడు.

వుండరండీ అసలు మీరు ఎముడిలా ఉండరు. విగ్గు కొన్నా సరే అన్నాడు నాన్న.

మరే అసలు ఎముడికీ మీకూ పోలికలు లేవు అన్నాడు సుబ్బారావుగారు.

ఎముడు నవ్వాడు, ఎముడి పోలికలు మరెవరికున్నాయట నాగ్గాక అన్నాడు.

అప్పుడేం జరిగిందో తెలుసా

వాళ్ళందరూ నావేపు తిరిగి ఇగో ఈ పెంకి భడవకి అనేశారు.

అప్పుడు మేనేజరు, నాన్న అందరూ నవ్వేశారు. ఇంటి కెళ్ళాక అమ్మ కూడా నవ్వేసింది.

★

పొగడ్తలు... విమర్శలు

రచయిత గురించి...

శ్రీ సి.వి.సర్వేశ్వర శర్మ విద్యావేత్త, ప్రముఖ సైన్సు రచయిత. 1984లో 'కోనసీమ సైన్సు పరిషత్' ఆవిర్భావానికి సూత్రధారి, పాత్రధారి. సైన్సు ప్రచారానికి సాహిత్య ప్రక్రియల్నే ఆసరాగా చేసుకున్నారు. పాటలు, బుర్రకథలు, నాటికలు, సంగీత రూపకాలు, కథల ద్వారా సైన్సును ప్రజలకు అందిస్తున్నారు. 99 సైన్స్ ప్రాజెక్ట్స్, 101 సైన్స్ ప్రయోగాలు, 71 సైన్స్ ఎగ్జిబిట్స్ వంటి 93 సైన్సు పుస్తకాలు రాశారు. ఇవేగాక ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయితగా, ఇంటర్ ఫిజిక్స్ (దూరవిద్య) పుస్తక రచయితగా అనుభవం గడించిన వీరు ప్రతివారం వికాసం శీర్షికన వ్యాసాలు అందించనున్నారు.

-ఎడిటర్

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

మనం ఒక సమాజంలో నివసిస్తూ ఉండడం వల్ల ఇతరుల అభిప్రాయాలతో మన ప్రవర్తన ముడిపడి ఉంటుంది. ఇతరుల అభిప్రాయం విమర్శ లేదా పొగడ్తల ద్వారా తెలుస్తుంటుంది. పొగడ్తలు మనిషి 'ఇగో'ను అనుకూలంగా స్పందింపజేస్తాయి.

ఎంత నిర్మాణాత్మకంగా, అర్థవంతంగా విమర్శించినా వాటి వల్ల మనిషి 'ఇగో' ప్రతికూలంగా వ్యతిరేకిస్తుంది. తల్లి బిడ్డ క్షేమం కాంక్షించి మందలిస్తే 'తల్లి తనను తక్కువ చేసి విమర్శిస్తోందని బిడ్డ భావిస్తాడు'. తిరగబడేధోరణి గల బిడ్డయితే 'తను పెద్దది కాబట్టి తిడుతోంది. తన గురించి తాను ఏమనుకుంటోంది?' అని అనుకోవడమేగాక 'అన్ని అంశాలపై ఆమెకు అధికారం ఉందా?' అని ప్రశ్నించే పరిస్థితికి వస్తాడు.

మనిషి ప్రవర్తనలో మార్పు కోసం విమర్శిస్తే ఆశించిన మార్పు వస్తుందా? రాదు. రాకపోవచ్చు. అయితే మనిషిని పొగిడి అతని ప్రవర్తనలో మార్పు తీసుకురావడం సులువు. ఈ పొగడ్తలలో యదార్థం ఉంటే పొగిడేవారికి, పొగిడించుకునేవారికి సంతోషంగా ఉంటుంది.



అభినందనలు వంటివి పరస్పరం లాభదాయకంగా, ప్రయోజనకరంగా ఉంటాయి. పొగిడి పనులు చేయించుకుంటూ త్వరత్వరగా జీవితంలో పైకి రావాలనుకునే వారిని గమనించుకోవాలి. వ్యాపార, రాజకీయ, ఉద్యోగ రంగాలలో ఈ కోవకు చెందినవారు ఎదురవుతూ ఉంటారు. వీరు అతి వేగంగా ఎదగాలనుకుంటారు.

కార్పొరేటు వ్యవస్థలో ...

కార్పొరేటు వ్యవస్థలో ఉద్యోగులను పొగిడి వారి నుండి గరిష్ట స్థాయిలో పని రాబట్టే ప్రయత్నం చేస్తుంటారు. దీనివల్ల తాత్కాలికంగా కొంత ప్రయోజనం కల్గినట్లు కన్పించినా కొద్దికాలంలోనే వీరి అసలు ఆలోచనలను పనిచేసేవారు పసిగట్టేస్తారు.

చేయగల్గిన పనులు కింది ఉద్యోగులకు ఇచ్చి 'బాధ్యత మీది' అని చెప్పడమంటే పరోక్షంగా వారిని పొగడడమే. ఆ పని చేయగలమనే ధీమా వారి ముఖాల్లో కాంతివంతంగా ప్రతిబింబించడం జరుగుతూనే ఉంటుంది. అంటే ఇటువంటి వాటికి వారిలో అనుకూల ప్రతిస్పందన కన్పిస్తుంది.

అస్తమానం అందరిని పొగుడుతూ కథ నడపడం ఎవరికీ సాధ్యం కాదు. ఒక్కొక్కప్పుడు ఇతరుల మంచి కోసం వారిని విమర్శించవలసివస్తుంది. బిడ్డ తరచు టి.వి. చూస్తూ చదువును అశ్రద్ధ చేస్తూ ఉంటే మందలించి విమర్శించవలసిన పరిస్థితి వస్తుంది. ఇటువంటి విమర్శలతో లేదా మందలింపులతో బిడ్డలలో మంచి విలువలు గల ప్రవర్తన సృష్టించే ప్రయత్నం తల్లిదండ్రులు చేస్తూ ఉంటారు.

నిజమైన స్నేహితులు కూడా ఇదేవిధంగా విమర్శించవచ్చు. మనిషి

ఎదురుగా మాట్లాడక చాటున వేళాకోళంగా మాట్లాడడం కన్నా విమర్శించడం మంచిది. విమర్శకుడు వివేకం లేనివాడయితే విమర్శ ప్రమాదానికి దారి తీసే ప్రమాదం వుంది.

విమర్శ నిరంతరం చేయకూడదు. అదొక సతాయింపుగా ఉండకూడదు. భార్య, భర్తను నిరంతరం విమర్శిస్తూ, సతాయించడం మొదలుపెడితే వారి మధ్య బంధం తెగిపోయే అవకాశం ఉంటుంది.

పోలికలు వద్దు!

పోలికలు ఎట్టి పరిస్థితులలోను తీసుకురాకూడదు. అన్నదమ్ములు ఇద్దరిలోను అన్న ఆల్‌రౌండర్‌గా ఉండి చదువులో టాప్‌గా ఉండవచ్చు. అన్నతో తరచు పోల్చి తమ్ముడిని చిన్నబుచ్చకూడదు. తల్లిదండ్రులు మంచి ఉద్దేశ్యంతో ఆ తమ్ముడిని విమర్శించినా ప్రతికూల ఫలితాలు వస్తాయి. అన్నగారు చదువులో ఫస్టు అయితే తమ్ముడు క్రీడల్లో బెస్టు అని అనుకూల శైలిలో మాట్లాడుతూ ఉంటే ఆశించిన మార్పు తమ్ముడి ప్రవర్తనలో తీసుకురాగల్గుతారు.

అధికంగా పీడించడం కూడా ఒకరకమైన విమర్శగా చెప్పుకోవచ్చు. ఈ బాధితుడు సాధారణంగా బలహీనుడైన వ్యక్తి అయి ఉంటాడు. కాలేజీల్లో కొత్తగాజేరిన వారు ర్యాగింగ్‌కు ఈ విధంగానే గురి అవుతుంటారు. ఇళ్లల్లో అయితే అందరికన్నా చిన్నవాడు ఇటువంటి హింసబారిన పడుతూ ఉంటాడు.

వివేకం గల తల్లిదండ్రులు ఆఖరి పిల్లవాడు తక్కువ భావానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఇతరుల పేరు ప్రతిష్టలను దెబ్బతీయడమే కొంతమంది పనిగా పెట్టుకుని వారిని నీచంగా విమర్శిస్తూ ఉంటారు. వీరు పుకార్లను షికార్లు చేయిస్తూ ఉంటారు. మనిషి ముందు వినయంగా ఉన్నట్లు నటిస్తూ మనిషి వెనుక ఇటువంటి నీచ విమర్శలు చేస్తూ ఉంటారు. ఇటువంటి వారిని దగ్గరకు రానియ్యకపోవడమే నివారణ మార్గంగా ఎంచుకోవాలి.

విమర్శలకు కుంగిపోకుండా ఉండేందుకు సమాజ జీవితంలో అదొక భాగమని గ్రహించుకోవాలి. మనుష్యద్వేషులయిన విమర్శకులు ప్రతి విషయాన్ని ప్రతికూల ధోరణితోనే చూస్తారు. శ్వాసక్రియ జరుపుకున్నంత తేలిగ్గా విమర్శల జల్లులు వీరు కురిపించేస్తూ ఉంటారు. సమాజాన్ని ప్రగతిపథంవైపు నడిపించడానికి అప్పుడప్పుడు అభినందనలు ఎంతో ఉపకరిస్తాయి. విమర్శలు ఎప్పుడూ మనిషిని నిరుత్సాహం వైపుకి గెంటుతూనే ఉంటాయి.

విమర్శలు ఎలా ఉండాలి?

- సహాయం చేసేవారికే విమర్శించే హక్కు ఉంటుంది.
- విమర్శ సహకరించేదిగా పరిష్కారమార్గాలు సూచించేదిగా ఉండాలి. అంతేకాని గాయపరచేదిగా ఉండకూడదు.
- విమర్శ... ఇతరులకు ప్రేరణగా ఉండాలిగాని విమర్శించేవారికి ఆనందాన్నిచ్చేదిగా మాత్రమే ఉండకూడదు.
- పని నాణ్యతను పెంచేదిగా ఉండాలి గాని మనిషిని భయపెట్టేలా ఉండకూడదు.
- ఒక ఔషధంలా ఉండాలి గాని నొప్పి కల్గించేదిగా ఉండకూడదు.
- స్పష్టతలేని విమర్శలుండకూడదు. సహేతుకంగా సందర్భానికి తగినట్లు ఉండాలిగాని వ్యంగ్యంగా కాదు.
- మనిషిని నలుగురిలో కాక ఒంటరిగా వున్నప్పడు విమర్శించవచ్చు.
- పనిని విమర్శించాలి గాని ఆ పని చేసిన మనిషిని కాదు.
- అవధులు దాటి ఎవరినీ విమర్శించకూడదు.
- విమర్శ చేసేందుకు తయారయిపోయి ఆకస్మిక విమర్శలు చేసే అలవాటుకు దూరంగా ఉండాలి.
- విషయంమీద తగినంత అవగాహన లేనివారు విమర్శించకూడదు.
- వ్యక్తిగత అభిప్రాయాలు, అయిష్టతలు విమర్శలో ప్రతిబింబించకూడదు.
- ఎలా చేయకూడదన్న విషయంపై విమర్శించడం కన్నా ఎలా చేయాలో చెప్పగల్గితే మంచిది.
- 'బాగాలేదని' చటుక్కున చెప్పడం కన్నా 'ఎలా ఉంటే' బాగుంటుందో చెప్పగల్గాలి.
- విమర్శిస్తూ తమ గొప్పదనం చాటుకోవాలనుకోవడం మానుకోవాలి. ఇతరులలోని గొప్పదనాన్ని వెలికితీసే విధంగా విమర్శించడం నేర్చుకోవాలి. ✶



బాలనేస్తం

మూడు తో ఆరు

పిల్లలూ... ఇక్కడ ఆరు పందులున్నాయి. ఈ బొమ్మలో ఎక్కడైనా సరే మూడు గీతలు గీసి ఒక్కో భాగంలో ఒక్కో జంతువు వుండే విధంగా చేయగలరా?



పొడుపు కథలు

నేస్తాలూ! మేం అయిదు పొడుపు కథలు వేస్తాం. జవాబులు చెప్పగలరేమో చూడండి.

1. అన్న దమ్ములు ఇద్దరు, లెక్క పెట్టేది పన్నెండు.
2. అన్నదమ్ములు ముగ్గురు. ముగ్గురూ ఎప్పుడూ కలిసే తిరుగుతారు.
3. అప్పుడప్పుడు వస్తాడు, అందిస్తే వెళ్తాడు.
4. అమారా దేశం నుండి తుమారా పండ్లు వస్తే కొనేవారే గానీ తినేవారు లేరు.
5. అవ్వ చీరకు పుట్టెడు చిల్లులు.

కోకిల

చిన్నారులూ... మీకు కోకిల తెలుసు కదా. వసంత కాలంలో ఉదయాన్నే కుహూ.... కుహూ... అని అరుస్తుంది. మనం దానికి పోటీగా కుహూ... అన్నామనుకోండి అది మళ్లీ కుహూ... అని ఇంకొంచెం పెద్దగా అరుస్తుంది. అయితే మగ కోకిలలు మాత్రమే కుహూ... మని అరుస్తాయి. కోకిల చూడ్డానికి కాకిలా నిగనిగ లాడే నలుపుతో వుంటుంది కానీ తోక కాకి తోక కన్నా పొడవుగా ఉంటుంది. కాకి కన్నా సన్నగా వుంటుంది. దీని ముక్కేమో పసుపు రంగులో ఉంటుంది. కళ్లు రక్తమంత ఎర్రగా ఉంటాయి. ఇది ఎప్పుడూ చెట్లమీదే ఉంటుంది. శీతాకాలంలో ఆ పక్షి అసలు ఉందా లేదా అన్న సందేహం కలుగుతుంది. అంటే చాలా సైలెంట్‌గా ఉంటుందన్నమాట. వసంత కాలం, వేసవి కాలంలో మాత్రం అరుస్తూనే ఉంటుంది. దీని ఆహారం మర్రిపళ్లు, రావిపళ్లు, రకరకాల చెర్రీపళ్లు... ఇంకా గొంగళి పురుగులు. మిగతా పక్షుల్లా కోకిల గూళ్లు కట్టుకోదు. అందుకే వాటి గుడ్లను కాకి గూట్లో భద్రపరుస్తుంది. అయితే గుడ్లన్నీ ఒకే గూటిలో పెట్టదు ఎందుకో మరి!. వీటి గుడ్లు లేత బూడిద రంగు, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. కాకి గుడ్లను పోలి ఉంటాయి. కాకపోతే కొంచెం పెద్దగా ఉంటాయి. కాకమ్మే ఈ గుడ్లను పొదిగి పిల్లల్ని చేస్తుంది.



పడవ దాటడం ఎలా?

ముగ్గురు సైనికులకి ఓ సమస్య వచ్చింది. వాళ్లు ఒక నదిని దాటాల్సి వచ్చింది. దానిమీద వంతెన లేదు. ఇద్దరు పిల్లల తమ పడవలో వాళ్లని నది దాటిస్తామన్నారు. కానీ ఆ పడవ చాలా చిన్నది. అది ఒక సైనికుణ్ణే భరించగలదు. పైగా ఒక సైనికుడితోపాటు ఒక పిల్లవాడు ఎక్కినా మునిగిపోతుంది. ఆ సైనికులెవ్వరికీ ఈతరాదు. కానీ ముగ్గురు సైనికులు నదిని దాటి ఆ పడవను ఆ పిల్లలకు తిరిగి ఇచ్చేశారు. అలా ఎలా చేశారు?

నేర్చుకుందాం!







నాలుగు భాగాలు ఎలా?

పక్కనున్న బొమ్మలో ఐదు సమాన చదరాలున్నాయి. ఇది ఒక పేపరు మీద గీసుకుని దీన్నే నాలుగు సమాన భాగాలు చెయ్యాలి. చేస్తారా మరి.

ఎంత మంది?

బుజ్జాయిలూ... ఆరుగురు అన్నదమ్ములున్నారు. ప్రతి అబ్బాయికీ ఒక సోదరి ఉంది. అంటే మొత్తం ఎంతమంది పిల్లలు ఉన్నారు?



మూడుతో ఆరు: **నాలుగు భాగాలు ఎలా?:**



ఎంతమంది : 12 మంది అనుకుంటున్నారా? కాదు. మొత్తం ఏడుగురు. ఆరుగురు అబ్బాయిలు. ఒక అమ్మాయి. 12 మంది ఉంటే ఒక్కో అబ్బాయికి ఆరేసి మంది చెల్లెళ్లు ఉండాలి కదా. **పడవ దాటడం ఎలా?:** నదిని ఆరుసార్లు పడవ మీద అటూ ఇటూ దాటారు. 1. మొదటి సారి ఇద్దరు పిల్లలు అవతలి ఒడ్డుకు వెళ్లారు. ఒకడు అక్కడే ఉండి రెండో వాడు పడవతో ఇవతలికి వచ్చాడు. 2. పడవను తెచ్చిన పిల్లవాడు ఇక్కడే ఉంటే ఒక సైనికుడు పడవలో అవతలి ఒడ్డుకు వెళ్లాడు. అక్కడ ఉన్న పిల్లవాడు పడవను మళ్లీ ఇవతలికి తీసుకువచ్చాడు. 3. మొదటి సారిలాగే పిల్లలిద్దరూ అవతలికి వెళ్లి ఒకడు పడవను వెనక్కి తెచ్చాడు. 4. రెండోసారి లాగే ఇంకో సైనికుడు వెళ్లి అక్కడున్న పిల్లవానితో పడవను వెనక్కి పంపాడు. 5. మూడో సైనికుడు అవతలి ఒడ్డుకు వెళ్లాడు. అక్కడున్న పిల్లవాడు వెనక్కి వచ్చాడు. అలా అవతలి ఒడ్డుకు ముగ్గురు సైనికుల్నీ చేర్చి ఆ పిల్లలిద్దరూ వాళ్లదారిన వాళ్లు వెళ్లారు. **పొడుపు కథలు**:1. గడియారం ముల్లు, అంకెలు. 2. ఫ్యాను, 3.ఆకలి, 4.పగడాలు, 5.పుట్ట

మాటల కోట - 42

రూపకల్పన : కర్లపాలెం

1	2	■	3		4	■	5	6
7		■		■		■	8	
	■	■	9	10		■		■
■	11	12	■		■	13	■	14
15				■	16		17	
	■		■	18	■	16ఎ		■
■	19	■	20		21	■	■	22
23		■		■		■	24	
25		■	26			■	27	

అడ్డం :

1. జటాయువు, జటార్ఝూటుడు – ఇద్దరికీ ముందుండే జుత్తు (2)
3. నేటి బాలుడే రేపటి ..... (3)
5. కొంతమంది ఈ చెట్టు పుల్లతో పళ్ల తోముకుంటారు (2)
7. భాగం (2)
8. ఇంగ్లీషు సోపు. తెలుగులో ఇలా అయింది (2)
9. సాక్ష్యం (3)
11. ఉత్సవం – తిరణాల (2)
15. నదులకు అడ్డంగా కట్టబడిన కట్ట (4)
16. పన్నులు కట్టకుండా దాచిపెట్టుకునే డబ్బు (4)
16ఎ. నరనారాయణులలో ముందుండే మానవుడు (2)
20. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) సంక్షిప్తంగా (3)
23. మునుపు, పూర్వము (2)
24. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ (2)
25. జంధ్యాల గారి హాస్యనటుడు సుత్తి... (2)
26. ఉపాయము (3)
27. పర్సనల్ కంప్యూటర్ సంక్షిప్తనామం (2)

నిలువు :

1. ప్రశ్నకు సమాధానం (3)
2. బిర్లాకు ముందుండే బిలియనీరు (2)
3. ఇంగ్లీషు పొడి (3)
4. వినికిడిలోపం... చెదిరిపోయింది (3)
5. బాబోయ్ చెమటల సీజన్ రాబోతోంది (3)
6. మన మద్యశాలను ఇంగ్లీషోళ్లు ఇలా పిలుచుకుంటారు (2)
10. జుట్టుని ఇలా కూడా అంటారు (2)
11. చేతి బొటన వేలినుండి మధ్య వేలి వరకు కొలత... బెత్త కాదు (2)
12. తల....... పెట్టయినా సరే అప్పు తీర్చాల్సిందే (3)
13. అందని ద్రాక్షాపళ్లు... (3)
14. మన రాష్ట్ర ఆర్థిక మంత్రి గారి ఇంటిపేరు (2)
15. క్రీడ (2)
17. భూమి, రేటు (2)
18. పాపం చేసిన వాడు (2)
19. ఇవి పీకితే ఎవరికైనా బాధే, బడ్జెట్ అం టే చాలు! అందరూ వీటి గురించే ఆలోచిస్తారు (3)
20. సూత్రం (3)
21. ఇది వచ్చాక మనిషి పని సులభతరమైంది (3)
22. జాయింట్ పార్లమెంటరీ కమిటీ సంక్షిప్తగా (3)
23. కింద నుండి పైకి వేపచెట్టు (2)
24. ప్రధానమంత్రి గారు అంటే పి.ఎం. గారు తిరగబడ్డారు (2)

మాటలకోట - 41 జవాబు

1 తె	2 లు	3 గు	■	■	■	4 బా	5 పూ	6 జీ
7 రి	పే	రు	■	■	8 హ	ము	స	మూ
పి	■	9 వు	య్యూ	10 రు	■	■	11 న్ను	త
■	12 డి	■	■	13 బా	14 హా	15 టం	■	ము
■	16 బ	17 భ	18 మ	య	ర	ల	19 వ	■
20 డు	■	21 తా	యె	త్తు	■	■	న్	■
22 ము	23 క	■	■	24 లు	జ	25 ముం	■	26 జు
27 వు	రా	28 వు	రా	■	■	29 గి	30 ద్ద	లు
31 లు	చి	క	■	■	■	32 స	గ	ము

వెంకడు



రామాపురం జమిందారు భూపతిరాజా గారి దివాణంలో వెంకడు అనే పనివాడు వుండేవాడు. వాడు ఒట్టి అమాయకుడు. ఒక పని చెప్తే మరోపని చేస్తాడు. వెంకడి మీద జమిందారుకి చాలా సార్లు కోపం వచ్చి పనిలో నుండి తీసెయ్యాలనుకున్నాడు. కానీ వాడిలోని నిజాయితీ, నమ్మకం ఆయనకి బాగా నచ్చి నాలుగు తిట్లు తిట్టడమో, మందలించడమో చేసేవారు. వేసవి కాలం వచ్చింది. మామిడి పళ్ల సీజన్. భూపతిరాజు గారికి మామిడిపళ్లంటే చాలా ఇష్టం. మామిడిపండు లేకుండా భోజనం చేసేవారు కాదు. రామాపురం పొరుగున విశాలపురం ఉంది. విశాలపురం జమిందారు గోపాలరావు భూపతి రాజాకి మంచి మిత్రుడు. గోపాలరావు భూపతి రాజాని కలిసినప్పుడు మాటల మధ్యలో మామిడిపళ్ల ప్రస్తావన వచ్చింది. దాంతో గోపాలరావు భూపతిరాజుతో

"దానికేం భాగ్యం. రెండు రోజుల్లో దివాణానికి చిన్న రసాలు వస్తాయి. ఎవరినైనా పంపావంటే పళ్లు ఇచ్చి పంపుతాను" అన్నారు.

"అలాగే! తప్పకుండా మనిషిని పంపుతాను" అన్నాడు భూపతిరాజా. గోపాలరావుగారు వెళ్లిపోయారు.

రెండు రోజుల తర్వాత మామిడి పళ్లు తేవడానికి ఎవర్ని పంపాలా అని ఆలోచించి వెంకడిని పిలిచారు. వెంకడు వచ్చి వినయంగా చేతులు కట్టుకుని నిలబడి "చెప్పండయ్యా! దేనికి పిలిచారు" అన్నాడు.

"నువ్వొక పని చెయ్యాలిరా. పొరుగూరు విశాలపురం గోపాలరావు గారు మొన్న వచ్చారు కదా. ఆయన మామిడిపళ్ల బుట్ట ఇస్తారు. వాటిని తీసుకు రావాలి" అన్నారు.

"చిత్తం తప్పకుండా వెళ్లి తీసుకొస్తానయ్యా" అన్నాడు.

"రేపు తెల్లారగట్ట బయలుదేరి వెళ్లు. జాగ్రత్త. ఒక పని చేయబోయి మరో పని చేసేవు"

"లేదయ్యా. అలా చెయ్యను. పళ్ల బుట్ట తీసుకునే వస్తాను" అన్నాడు.

రామాపురం నుండి విశాలపురం వెళ్లాలంటే అడవి దారిన వెళ్లాలి. కాలినడకన వెళితే నాలుగు మైళ్లు వుంటుంది. వెంకడు తెల్లవారుఝామునే లేచి చద్దన్నం తిని బయలుదేరి వెళ్లాడు. విశాలపురం చేరేసరికి పది గంటలయింది. జమిందారు గోపాలరావు గారితో విషయం చెప్పాడు. ఆయన పనివాళ్లతో బుట్టనిండా పళ్లు పెట్టించి వాటితో పాటు ఒక చీటీ ఇచ్చి " ఈ మామిడిపళ్లు, చీటీ మీ జమిందారు గారికి ఇవ్వు" అని చెప్పారు.

"అలాగేనయ్యా" అని మామిడి పళ్ల బుట్టనెత్తుకుని బయలుదేరాడు.

అడవిమధ్యలోకి నడిచొచ్చేసరికి వెంకడికి నీరసం వచ్చింది. అదికాక ఎప్పుడో తెల్లవారుజామున తిన్న చద్దన్నం కూడా అరిగిపోయి ఆకలి మొదలయింది.

తింటానికి అడవిలో ఏం దొరకలేదు. వెంకడికొక ఆలోచన వచ్చింది. చంకలో పిల్లాణ్ని పెట్టుకుని ఊరంతా వెతికినట్లు నెత్తిన మామిడి పళ్లు పెట్టుకుని అడవంతా వెతుకుతున్నానంటే నాకు నిజంగానే బుద్ధిలేదు" అనుకుని బుట్ట కిందకి దింపి ఆవురుమంటూ నాలుగు పళ్లు తినేశాడు. ఆకలి తీరింది. గబగబ నడిచి ఇంటికి వచ్చాడు.

"ఏరా! పెద్దాయన మామిడిపళ్లు పంపారా?" అని అడిగారు భూపతిరాజా.

"తెచ్చినా అయ్యగారు" అని బుట్ట కిందికి దింపి గోపాలరావు గారు ఇచ్చిన చీటీ ఇచ్చాడు. చీటీలో 100 పళ్లు పంపినట్లు రాసుంది. భూపతిరాజా లెక్కపెడితే 96 పళ్లే ఉన్నాయి.

"ఏరా వెంకా! 96 పళ్లే ఉన్నాయి. మిగిలిన నాలుగు పళ్లు ఏవి?" అని గట్టిగా అడిగాడు.

"ఆకలేసి తిన్నానండి. అయినా నేను పళ్లు తిన్న విషయం మీకెలా తెలిసింది?" అన్నాడు అమాయకంగా.

"ఈ చీటీ చెప్పింది" అన్నాడు నవ్వుతూ.

"ఈ కాగితం ముక్క మనుషుల్లా మాట్లాడుతుందా?" అన్నాడు.

వాడి అమాయకత్వానికి నవ్వుకుని "సరే పోయి అన్నం తినుపో" అన్నారు.

పది రోజులకి పళ్లు అయిపోయాయి. వెంకడికి చెప్పి మళ్లీ పంపారు.

వెంకడు విశాలపురం వెళ్లి గోపాలరావు గారిచ్చిన పళ్లబుట్ట తీసుకుని అడవి మధ్యకి వచ్చేసరికి ఆకలేసింది.

పోయిన సారి చీటీ పళ్లలెక్క చెప్పడం గుర్తుకువచ్చి ఏం చెయ్యాలా అని ఆలోచించి ఒక చిన్న గొయ్యి తవ్వి చీటీ గోతిలో పెట్టి మట్టితో కప్పెట్టాడు.

శుభ్రంగా పళ్లుతిని నీళ్లు తాగి గోతిలో పెట్టిన చీటీ తీసుకుని ఇంటికొచ్చాడు. తీరా చూస్తే పళ్లు తగ్గాయి.

"ఏరా మళ్లీ పళ్లు తిన్నావా?" అన్నారు గట్టిగా కోపంతో.

"తిన్నానయ్యగారు. ఆకలేసింది. పళ్లు తిన్నాను. అవునయ్యగారు! నాకో అనుమానం. కిందటిసారి మీకు చీటీ చెప్పిందన్నారు కదా. ఇప్పుడెవరు చెప్పారు?"

"ఇప్పుడు కూడా చీటీనే చెప్పింది"

"అదెలా చెపుతుంది. నేను తినేటప్పుడు దాన్ని గోతిలో కప్పెట్టానుగా" అన్నాడు అదే అమాయకత్వంతో.

"దానికి కళ్లుంటాయిలేరా. నువ్వు ఎక్కడ పెట్టినా చెప్పేస్తుంది" అన్నారు పెద్దగా నవ్వుతూ.

"అయితే గోతిలో పెట్టిన కాగితపు ముక్క కూడా మాట్లాడుతుందన్నమాట. అమ్మో జాగ్రత్తగా ఉండాలి. ఒక వేళ తిన్నా దానికంటే నేనే ముందుగా చెప్పాలి" అనుకున్నాడు వెర్రి వెంకన్న

\- సిహెచ్.వి.యస్. బ్రహ్మానందరావు

9440387480





ప్రకృతి ఒడిలో పాఠశాల

పట్టణాలు, నగరాల్లో స్కూళ్లు ఎలా వుంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు! కాంక్రీటు భవనాల్లో ఇరుకిరుకు గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడే పిల్లలు మనకు దర్శనమిస్తారు. ఇంక ఆటస్థలం గురించి వేరే చెప్పేదేముంది! అస్సలు అలాంటిదేమీ లేకుండానే పాఠశాల విద్య పూర్తిచేసుకునే చిన్నారులెందరో.

ఈ పేజీలో మీకు కనిపిస్తున్న చోటే పిల్లలకు చదువుకునే సౌకర్యం వుంటే ఎలా వుంటుంది? అద్భుతంగానా! ఈ వాతావరణం ఇండొనేషియాలోని బాలిలో వుంది. ఈ పాఠశాల పేరే గ్రీన్ స్కూల్. పచ్చటి వాతావరణంలో కొలువు తీరింది. పాఠశాల గదులను చప్ప, వెదురుబొంగులు, కలపతోనే ఏర్పాటు చేశారు. సిమెంటును బేస్‌మెంట్‌లో మాత్రమే ఉపయోగించారు. పిల్లలు చదువుకునే గదులు, కంప్యూటర్ గదులు, ప్రయోగశాలలు, విశ్రాంతి గదులు మొత్తం వెదురుమయమే. పాఠశాల నిర్వహణకు ఉపయోగించే విద్యుత్తు కూడా అధికశాతం సౌరశక్తితో రూపొందించినదే.

వీటన్నిటినీ చూస్తుంటే.....మీ చిన్నారులను ఇలాంటి స్కూల్లోనే చదివించాలి అనిపిస్తోందా!